J/NELLORE/003/24-26 R.N.I.No.25359/74 పేజీలు : 12

THE BEST TELUGU WEEKLY OF NELLOREANS




# లాయర్

సంపుటి : 45 సంచిక : 5 4.7.2025, శుక్రవారం వెల : రూ. 10/- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

అందరి దృష్టి పునర్విభజనపైనే...



# ఆశల పల్లకిలో.. ఆశావహులు

- తెలుగు రాష్ట్రాల్లో పెరగనున్న అసెంబ్లీ సీట్లు
- 2026 జనాభా లెక్కల ఆధారంగా కేటాయింపు
- పలువురి నాయకుల్లో ఎమ్మెల్యే ఆశలు
- సీటు కోసం ఇప్పటినుంచే పావులు

*ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న తరుణం... రానేవచ్చింది. తెలుగు రాష్ట్రాల్లో అసెంబ్లీ స్థానాల పెంపునకు మార్గం సుగమమైంది. గత 11 సంవత్సరాలుగా ఈవిషయంపై నాన్చుడు ధోరణి అవలంభిస్తున్న కేంద్ర ప్రభుత్వం ఎట్టకేలకు అడుగు ముందుకు వేసింది. 2026 ఏప్రిల్ 1వ తేదీన చేపట్టనున్న జాతీయ జనగణన ఆధారంగా ఆంధ్రప్రదేశ్‌లో 50 ఎమ్మెల్యే సీట్లు, తెలంగాణలో 34 ఎమ్మెల్యే సీట్లు అదనంగా పెరగనున్నాయి. ఎప్పుడూ లేనివిధంగా ఈసారి జనగణనతో పాటు కుల గణనను కూడా అంతర్లీనం చేయడంతో జనాభా నిష్పత్తి ప్రాతిపదికన ఎస్సీ, ఎస్టీ స్థానాలపై సైతం ఓ స్పష్టత రానుంది. ఇక తమకు కూడా రిజర్వేషన్లు దక్కుతాయేమోననే ఆశతో బీసీలు సైతం ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో 2029 శాసనసభ ఎన్నికల్లో పోటీపడే ఆశావహుల సంఖ్య గణనీయంగా పెరగనుంది. తద్వారా వారంతా తమతమ పార్టీ అధిష్టానాలను ఇప్పటి నుంచే ప్రసన్నం చేసుకునే పనిలో పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఏదేమైనా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పునర్ వ్యవస్థీకరణ చట్టంలో పేర్కొన్నట్లుగా తెలంగాణ, విభజిత ఆంధ్రప్రదేశ్‌లో అసెంబ్లీ నియోజకవర్గాల పెంపు చేపట్టనుండడంతో తెలుగు రాష్ట్రాల భౌతిక, రాజకీయ, సాంస్కృతిక అంశాల్లో కీలక మార్పులు చోటు చేసుకోవడం తథ్యమని విశ్లేషకులు భావిస్తున్నారు.*


## పునర్ వ్యవస్థీకరణకు తొలి అడుగు..

ఆంధ్రప్రదేశ్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరిగి ఏడాది అవుతోంది. అదే తెలంగాణలో అయితే ఏడాదిన్నర కాలం కావొస్తోంది. కానీ రెండు రాష్ట్రాల్లో ప్రస్తుతం ఇది ఎన్నికల ఏడాదా...? అని అనుమానం వచ్చేలా అధికార, ప్రతిపక్షాలు పోటాపోటీగా విమర్శల వాగ్బాణాలు సంధించుకుంటున్నాయి. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో అయితే కూటమి పార్టీలు, ప్రతిపక్ష వైఎస్సార్ సీపీ ఎత్తుకు పైఎత్తులతో దూసుకెళ్తున్నాయి. ఓ వైపు తొలి ఏడాది ప్రభుత్వ విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లే క్రమంలో 'సుపరిపాలనలో తొలి అడుగు' పేరుతో కూటమి నేతలు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటే, మరోవైపు ఐదువారాల కార్యాచరణతో చంద్రబాబు మోసాలను జనానికి తెలియజేయాలని వైఎస్సార్‌సీపీ నాయకులు కార్యక్రమాన్ని రూపొందిస్తున్నారు. ఈ క్రమంలో టార్గెట్ 2029 ప్రారంభమైందంటూ స్వయంగా సీఎం చంద్రబాబే ప్రకటించడంతో రాష్ట్రంలో రాజకీయ వేడి నెలకొంది. ఇలాంటి తరుణంలో కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం జాతీయ జనాభా లెక్కల సేకరణకు నోటిఫికేషన్ ఇవ్వడం తద్వారా ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో పునర్ విభజన చట్టం ప్రాతిపదికగా అసెంబ్లీ నియోజకవర్గాల పెంపునకు దారులు తెరుచుకోవడం నాయకుల్లో మరింత ఊపు తెచ్చింది. 2014లో తెలుగు రాష్ట్రాలు విడిపోయిన వెంటనే ఆస్తులు, అప్పులను 2011 జనాభా లెక్కలప్రకారం అప్పటి కేంద్ర ప్రభుత్వం ఇరు రాష్ట్రాలకు కేటాయించింది. అయితే నియోజకవర్గాల పెంపు విషయాన్ని మాత్రం కోల్డ్‌స్టోరేజ్‌లో పెట్టేసింది. ఆంధ్రాలో వరుసగా మోదీ భజన ప్రభుత్వాలు ఉండడంతో దీనిపై నోరు మెదపలేదు. తెలంగాణలో ప్రభుత్వాలు మాత్రం అనేకసార్లు కేంద్రానికి నియోజకవర్గాల పునర్ విభజన చేపట్టాలంటూ వినతులు సమర్పించాయి. సుప్రీంకోర్టులో సైతం కేసులు నమోదయ్యాయి. అయితే "ఎప్పటికెయ్యది ప్రస్తుతమో... అప్పటికి ఆ ధోరణి " అన్నట్లుగా కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అసెంబ్లీ సీట్ల పెంపుపై తాత్సారం చేస్తూ వచ్చింది. చివరికి కొత్త జనాభా లెక్కల ఆధారంగా నియోజకవర్గాలను పునర్ వ్యవస్థీకరణ చేస్తామని సుప్రీంకోర్టుకు విన్నవించింది.

## ఆంధ్రాలో 225కి.. తెలంగాణలో 153కి..

ఏపీ రీ ఆర్గనైజేషన్ యాక్ట్ ప్రకారం తెలంగాణ, విభజిత ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన వెంటనే అసెంబ్లీ నియోజకవర్గాల సంఖ్యను పెంచి ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. అయితే, కేంద్ర ప్రభుత్వం ఈ విషయంలో మిన్నకుండి పోవడంతో జాతీయ ఎన్నికల కమిషన్ సైతం పాత నియోజకవర్గాల సంఖ్యతోనే ఎన్నికలు. నిర్వహించింది. ఫలితంగా ఆంధ్రాలో 175 నియోజకవర్గాలకు, తెలంగాణలో 119 నియోజకవర్గాలకు మూడుసార్లు ఎన్నికలు( 2014, 2019, 2024 సంవత్సరాల్లో) జరిగాయి. అయితే దీనికి కారణం 2021లో చేపట్టాల్సిన జనగణన కరోనా కారణంతో చేపట్టలేకపోతున్నట్లు అని మోదీ ప్రభుత్వం ప్రకటించింది. తాజాగా 2026 ఏప్రిల్ 1 నుంచి 16వ జాతీయ జన గణన అధికారికంగా ప్రారంభమవుతుందని రిజిస్టర్ జనరల్, సెన్సెస్ కమిషనర్ ఆఫ్ ఇండియా మృత్యుంజయ్ నారాయణ్ ప్రకటించారు. ఈమేరకు ఈ ఏడాది డిసెంబర్ 31 లోపు అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్ర పాలిత ప్రాంతాల కార్యదర్శులు జనాభా లెక్కల సేకరణకు వీలుగా పరిపాలనా యూనిట్లలో మార్పులు చేర్పులను తెలియజేయాలని సూచించారు. ఈమేరకు ఎన్యూమరేటర్లను నియమిస్తామని ప్రకటించారు. 2027 మార్చి 1వ తేదీకి జనాభా లెక్కల సేకరణను పూర్తిచేస్తామని వెల్లడించారు. దేశంలో చివరిసారి 2011లో జనగణన జరిగింది. మళ్లీ 15 సంవత్సరాల తర్వాత చేపట్టనున్నారు. కాగా తెలుగు రాష్ట్రాల్లో జనాభా నిష్పత్తిలో పెరుగుదల ఎలా ఉన్నా , ఒక్కో ఎంపీ నియోజకవర్గానికి సగటున రెండు అసెంబ్లీ నియోజకవర్గాల పెంపు మాత్రం కచ్చితంగా ఉండనుంది. దీంతో ఆంధ్రప్రదేశ్‌లో నియోజకవర్గాల సంఖ్య 225కి, తెలంగాణలో 153కి చేరుకోనున్నాయి. ఫలితంగా ప్రస్తుతం ద్వితీయశ్రేణి నేతలుగా ఉన్న పలువురు ఎమ్మెల్యే యోగం పొందడం కోసం ఇప్పటినుంచే ఆశలు పెంచుకుంటున్నారు. తమ అధినేతల మెప్పు పొందేందుకు, అంగ, అర్థబలం ప్రదర్శించేందుకు తహతహలాడుతున్నారు.

2లో



## శ్రీ షిర్డి సాయిబాబా గురుపూర్ణిమ మహోత్సవములు

తేది. 10-07-2025 గురువారం నుండి తేది. 18-07-2025 శుక్రవారము వరకు జరుగును.

**కార్యక్రమ వివరములు:**

తేది. 10.7.2025 గురువారం నుండి తేది.16.7.2025 బుధవారం వరకు ప్రతిరోజు ఉ॥7-00గం.ల నుండి బాబా వారికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకములు, మ॥ 12.00 గ॥ల నుండి సామూహిక అష్టోత్తర సహస్రనామ పూజలు జరుగును. పై పూజా కార్యక్రమాలలో పాల్గొనదలచిన భక్తులు మందిర గుమస్తా వద్ద రూ.300/- చెల్లించి తగు రసీదు పొంది, పూజా కార్యక్రమాలలో పాల్గొని తీర్థ ప్రసాదములు స్వీకరించి శ్రీ బాబా వారి కృపకు పాత్రులగుదురని కోరుకుంటున్నాము.

**బాబా నగరోత్సవం:**

తేది.16-7-2025 బుధవారం సా॥ 6.00 గం॥లకు పుష్పాలంకరణలతో, మంగళవాయిద్యములతో, విద్యుత్‌దీప కాంతులతో, బాణాసంచా వేడుకలతో శ్రీ షిర్డి సాయిబాబా మందిరం నుండి గాంధీబొమ్మ, ట్రంక్‌రోడ్, ఏ.సి.సెంటర్, సంతపేట మండపము, చిన్నబజార్, పెద్దబజార్, బారకాసు, వి.ఆర్.కాలేజ్ సెంటర్, కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ మీదుగా తిరిగి నగరోత్సవం శ్రీ షిర్డి సాయిబాబా మందిరానికి చేరును.

తేది.18.7.2025 శుక్రవారము మ॥ 12.00గం.లకు అన్నప్రసాదం కార్యక్రమం జరుగును.

(పై అన్నదానముకు భక్తులు తమకు తోచిన విధంగా వస్తురూపంగా గానీ, ధన రూపంగా గాని చెల్లించి తగిన రశీదు పొందవలెను)

ఇట్లు: కార్యవర్గం

శ్రీ షిర్డి సాయిబాబా మందిరం

గాంధీనగర్, ట్రంకురోడ్డు, నెల్లూరు.

# ఎన్‌బికెఆర్‌లో.. ముగిసిన ఎన్‌సిసి శిబిరం



కోట మండలంలోని విద్యానగర్‌లో ఉన్న ఎన్‌బికెఆర్ ఐఎస్టీలో ఇటీవల నిర్వహించిన ఎన్‌సిసి వార్షిక శిక్షణా శిబిరం విజయవంతంగా ముగిసింది. దాదాపు 600 మంది ఎన్‌సిసి క్యాడెట్లు పాల్గొని పలు అంశాలపై శిక్షణ తీసుకున్నారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎన్‌బికెఆర్ ఐఎస్టీ డైరెక్టర్ డాక్టర్ వి.విజయకుమార్‌రెడ్డి, ఈ శిబిరం విజయవంతం కావడం తనకెంతో ఆనందంగా ఉందన్నారు. 10 రోజుల పాటు జరిగిన ఈ శిబిరంలో, క్యాడెట్లు ఫైరింగ్ సెషన్లు, శారీరక వ్యాయామాలతో పాటు, రోజువారీ సాంస్కృతిక కార్యక్రమాలు క్యాడెట్ల మానసిక వికాసానికి బాగా తోడ్పడ్డాయి. ప్రేరణాత్మక సినిమాలు, అవగాహన సెషన్లు మరియు ఎస్‌డి,ఎస్‌డబ్ల్యూ క్యాడెట్ల కోసం డ్రోన్ టెక్నాలజీ తరగతులు, అగ్నిమాపక, అంబులెన్స్ ఆపరేషన్లు మరియు ట్రాఫిక్ నియంత్రణ శిక్షణ వంటి సాంకేతిక కార్యకలాపాలను నిర్వహించారు. అదేవిధంగా, మాదకద్రవ్యాల వ్యతిరేక ర్యాలీ, ఆరోగ్యం మరియు పరిశుభ్రత అవగాహన ఉపన్యాసాలు వగైరాలన్నీ క్యాడెట్లను ఆకర్షించాయి. క్యాంప్ కమాండెంట్ లెఫ్టినెంట్ కమాండర్ గణేష్ గొడం గవే మాట్లాడుతూ, పెద్దసంఖ్యలో హాజరైన ఎన్‌సిసి క్యాడెట్లకు వసతి కల్పించడం మరియు శిక్షణ ఇవ్వడం ద్వారా, తన సేవలో తాను చూసిన అత్యుత్తమ సంస్థలలో ఎన్‌బికెఆర్ ఒకటని ప్రశంసించారు. ఈ శిబిరాలను ఏటా నిర్వహించడంలో సహకరిస్తున్నందుకు ఎన్‌బికెఆర్ ఐఎస్టీ కరస్పాండెంట్ నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. శిబిరాన్ని సజావుగా నిర్వహించడంలో అవిశ్రాంత అంకితభావంతో పనిచేసినందుకు కళాశాల ఎన్‌ఏఓ సబ్ లెఫ్టినెంట్ డాక్టర్ వి.మల్లికార్జునరెడ్డిని ఆయన అభినందించారు. ఎన్‌బికెఆర్ ఐఎస్టీ డైరెక్టర్ డాక్టర్ వి.విజయకుమార్‌రెడ్డి సహకారాన్ని మెచ్చుకుంటూ, కమాండింగ్ ఆఫీసర్ ఆయన్ను ఘనంగా సత్కరించారు. ముగింపు వేడుకలో, కమాండింగ్ ఆఫీసర్ అన్ని పోటీల విజేతలు మరియు రన్నరప్‌లకు ట్రోఫీలను అందజేశారు మరియు జూనియర్ మరియు సీనియర్ విభాగాలలో ఉత్తమ క్యాడెట్లను ప్రకటించారు. ఛాంపియన్షిప్ 'సి' స్క్వాడ్రన్‌కి దక్కింది. స్క్వాడ్రన్ ఏఎన్ఓ గోవిందు నాయకత్వం వహించారు. అంకితభావం, సమిష్టికృషితో ఈ శిబిరాన్ని గొప్పగా విజయవంతం చేసిన అన్ని విభాగాల ఏఎన్‌ఓలు, సివిల్ సిబ్బంది, క్యాడెట్లను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమం అంతటా కీలక పాత్రలు పోషించిన క్యాంప్ అధికారి సబ్‌లెఫ్టినెంట్ డాక్టర్ వి.మల్లికార్జునరెడ్డి, చీఫ్‌ఇన్‌స్ట్రక్టర్ వైకుంఠం అందించిన సహకారం మరువలేమన్నారు. ఏఎన్ఓ సి.వి.నాగరాజు, లక్ష్మీనారాయణ, పెంచలయ్య, గోవిందు, నరేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

# త్వరితగతిన అభివృద్ధి పనులు చేపట్టాలి

○ జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ



ప్రజల కోసం చేపట్టిన అభివృద్ధి పనులను అధికారులు, సిబ్బంది త్వరితగతిన పూర్తిచేయాలని జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ సూచించారు. ఈనెల 3న ఆమె నెల్లూరు సమీపంలోని చింతారెడ్డిపాలెంలో అసంపూర్తిగా వున్న అంగన్ వాడీ భవన నిర్మాణాన్ని పరిశీలించారు. అది ఇంకా అసంపూర్తిగా ఉండడంతో, అ పనులన్నీ వేగవంతం చేయాలని ఆదేశించారు. అందుకు అవసరమైన 10 లక్షల రూపాయలను జడ్పీ నిధుల నుంచి విడుదల చేశారు. భవనంలో విద్యుత్ ఏర్పాట్లు, మరుగుదొడ్ల నిర్మాణాలతో పాటు, అంగన్‌వాడీ కేంద్రానికి ప్రహరీగోడ నిర్మించాలని ఆమె సూచించారు.

# ఆశల పల్లకిలో.. ఆశావహులు

(మొదటిపేజీ తరువాయి)

## ఎంపీ సీట్లపై మాత్రం సందిగ్ధం..

తెలుగు రాష్ట్రాల్లో అసెంబ్లీ నియోజకవర్గాల పెంపు తథ్యమైనా, ఎంపీ నియోజకవర్గాలపై మాత్రం సందిగ్ధం నెలకొంది. ప్రస్తుతం భారతదేశం ప్రపంచంలోనే అత్యధిక జనాభా ఉన్న దేశంగా ఐక్యరాజ్యసమితి ఇప్పటికే ప్రకటించింది. రమారమి మనదేశ జనాభా 140 కోట్లకు పైగా ఉంటుందని అంచనా వేసింది. దీనికి కారణం మనదేశంలో 2011 తర్వాత జనాభా లెక్కలు చేపట్టకపోవడమే. కాగా 2026లో జనగణన చేపట్టి, తద్వారా లోక్‌సభ నియోజకవర్గాలను పునర్ వ్యవస్థీకరణ కమిషన్‌ను ఏర్పాటు చేసి 2028 నాటికి పునర్విభజన ప్రక్రియను పూర్తి చేయాలని మోదీ ప్రభుత్వం భావిస్తున్నట్లు సమాచారం. దీనికి కారణం ఇప్పటికే లోక్‌సభ నియోజకవర్గాల్లో జనాభా సంఖ్య అత్యంత భారీస్థాయికి చేరింది. ఇది అమెరికాలోని ఎంపీ నియోజకవర్గ జనాభాకంటే నాలుగురెట్లు అధికంగా ఉండడం గమనార్హం. తద్వారా పరిపాలనలో పారదర్శకత లోపిస్తోందన్నది కేంద్రం భావన. కొత్త జనాభాలెక్కల ఆధారంగా నియోజకవర్గాల పునర్విభజన చేపట్టడంద్వారా ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుందని భావిస్తోంది. అయితే 1952లో కేంద్రం తీసుకొచ్చిన కుటుంబ నియంత్రణను సక్రమంగా అమలు చేసిన దక్షిణాది రాష్ట్రాల్లో ప్రస్తుతం జనాభా పెరుగుదల రేటు గణనీయంగా తగ్గింది. అయితే కుటుంబ నియంత్రణను నిర్లక్ష్యం చేసిన ఉత్తరాది రాష్ట్రాల్లో మాత్రం అది అత్యధికంగా ఉంది. ఫలితంగా ప్రస్తుతం ఉన్న జనాభా ప్రాతిపదికగా నియోజకవర్గాల పునర్విభజన చేపడితే యూపీ, బిహార్, రాజస్థాన్, మధ్యప్రదేశ్, గుజరాత్‌లో ఎంపీ సీట్లు భారీ స్థాయిలో పెరిగే అవకాశాలుఉన్నాయి. కానీ దక్షిణాది రాష్ట్రాలో మాత్రం సీట్ల సంఖ్య పెరగకపోగా, తగ్గే ప్రమాదం కనిపిస్తోంది. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం వసూలు చేసే పన్నుల ఆదాయాన్ని పంపిణీ చేసే క్రమంలో జనాభాను ప్రాతిపదికగా తీసుకుంటుండడంతో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతోంది. దీంతో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కుటుంబ నియంత్రణ విధానాన్ని సక్రమంగా అమలు చేసినందుకు ప్రోత్సాహకాలు అందించాల్సింది పోయి, ఆదాయ పంపిణీలో వివక్ష చూపడమేమిటని ఇక్కడి నాయకులు అగ్గిమీద గుగ్గిలం అవుతున్నారు.

ఇలాంటి సమయంలో పుండుమీద కారం చల్లినట్లుగా కేంద్రం 2026లో దేశంలో చేపట్టనున్న పార్లమెంటరీ నియోజకవర్గాల పునర్విభజనలో ప్రస్తుత జనాభా లెక్కలను ప్రాతిపదికగా తీసుకుంటుందనే ప్రచారం జోరందుకోవడంతో జనాభా అధికంగా ఉండే ఉత్తరాది రాష్ట్రాల్లో లోక్‌సభ సీట్లు గణనీయంగా పెరుగుతాయని, తమ రాష్ట్రాల్లో సీట్లు భారీస్థాయిలో తగ్గుతాయని దక్షిణాది నాయకులు భావిస్తున్నారు. ఇదే జరిగితే ఆంధ్రప్రదేశ్‌లో సీట్ల సంఖ్య 25 నుంచి 20కి, కేరళలో 20 నుంచి 13కి, కర్ణాటకలో 28 నుంచి 26కి, తెలంగాణలో 17 నుంచి 14కి, తమిళనాడులో 39 నుంచి 31కి తగ్గిపోతుందనే అంచనాలుండడం వారిని కలవరపరుస్తోంది. దీనిపై తమిళనాడు సీఎం స్టాలిన్, తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటికే ఆందోళన వ్యక్తం చేయగా, మిగిలిన రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఆచితూచి వ్యవహరిస్తున్నారు. ఏదేమైనా నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణ అనే తేనెతుట్టెను జనాభా లెక్కల సేకరణ ప్రక్రియ ద్వారా కేంద్రం కదిపిందని విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు. అయితే ఏపీ, తెలంగాణలలోని అన్ని పార్టీల నేతల్లో మాత్రం కొత్త ఆశలు చిగురించాయనడంలో సందేహం లేదు. పునర్విభజన జరిగి సీట్లు పెరిగితే తామే అభ్యర్థులమని కలలుకంటూ అనేక మంది ద్వితీయశ్రేణి నాయకులు ఆశల పల్లకిలో విహరిస్తున్నారు..!

# నెల్లూరులో తొలిసారిగా..

# రాష్ట్ర వక్ఫ్‌బోర్డు సమావేశం

## వక్ఫ్ ఆస్తులను కాపాడుకోవాలన్న ఛైర్మెన్ అబ్దుల్ అజీజ్



వక్ఫ్ ఆస్తులను కాపాడుకోవాలని, అదే సందర్భంలో ఆ ఆస్తుల నుండి ఆదాయాన్ని కూడా ఆర్జించాలని రాష్ట్ర వక్ఫ్‌బోర్డు ఛైర్మెన్ అబ్దుల్ అజీజ్ చెప్పారు. ఇటీవల నెల్లూరు నగరపాలక సంస్థ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో రాష్ట్ర వక్ఫ్‌బోర్డు సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాల్లో వక్ఫ్‌బోర్డు సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించగా, తొలిసారి నెల్లూరులోనే నిర్వహించడం విశేషం. ఈ సమావేశంలో బోర్డ్ సభ్యులైన శాసనమండలి సభ్యులు రూహుల్లా, గుంటూరు తూర్పు నియోజకవర్గ శాసనసభ్యులు నసీర్ అహ్మద్, ఖాజా, అక్రం, ముకర్రం, ఇస్మాయిల్ బేగ్, ఆఫియా, బేపారీ జాకీర్‌అహమద్, దావూద్‌బాషా బఖావి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బోర్డు ఛైర్మెన్ అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ, వక్ఫ్‌బోర్డుకు ఆదాయం పెంచేందుకు, ముఖ్యంగా రాష్ట్రస్థాయిలో రెంట్ రివ్యూ కమిటీని ఏర్పాటుచేసి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో బోర్డు ప్రత్యక్ష నిర్వహణలో ఉన్న 1300 షాపుల అద్దెలను పరిశీలిస్తామన్నారు. ఇరువైపులా ఎవరికి ఇబ్బంది లేకుండా ఆయా షాపుల వారితో మాట్లాడి ఆదాయాన్ని పెంచేందుకు, తద్వారా పేద ముస్లింల సంక్షేమానికి కృషి చేస్తామన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాల్లో వక్ఫ్‌బోర్డు సమావేశాలు జరపడం ద్వారా ఆయా జిల్లాల్లో ఉన్న సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకు అవకాశం ఉంటుందని భావించామన్నారు. గత ప్రభుత్వంలో వక్ఫ్‌బోర్డు ద్వారా ఎలాంటి అభివృద్ధి పనులు చేయకపోవడమే కాకుండా, కేంద్రం మంజూరు చేసిన 386 కోట్ల నిధులకు యుటిలైజేషన్ సర్టిఫికేట్ పంపకపోవడంతో కేంద్రం కొత్తగా నిధులు మంజూరు చేయడంలేదన్నారు. మైనారిటీల అభివృద్ధికి అడ్డంకిగా ఉన్న ఈ విషయంలో ముఖ్యమంత్రి స్థాయిలో మాట్లాడి త్వరలోనే సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అలాగే వక్ఫ్‌భూములను అమ్మేసిన ముతవల్లీలు (ధర్మకర్తలు) విషయం విచారించి, వారిపై క్రిమినల్ కేసులు పెడతామన్నారు. నెల్లూరు బారాషహీద్ దర్గా అభివృద్ధికి వక్ఫ్‌బోర్డ్ తరఫున 1.5 కోట్ల రూపాయలు కేటాయించామని, అలాగే కసుమూరు, ఏఎస్ పేట దర్గాలను పెద్దఎత్తున అభివృద్ధి చేయబోతున్నామని తెలిపారు. వక్ఫ్‌బోర్డు సీఈవో షేక్ మహమ్మద్ ఆలీ, అధికారులు అబ్దుల్ ఖాదిర్ తదితరులు పాల్గొన్నారు.

## కాకర్ల సారధ్యంలో...

# వింజమూరులో విజయవంతంగా జాబ్‌మేళా



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో, ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ సారధ్యంలో వింజమూరులోని శ్రీ నేతాజీ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో జరుగుతున్న జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. జూన్ 30న డిగ్రీ కళాశాలలోని 20 తరగతి గదులలో 20 కంపెనీలతో ఇంటర్వ్యూలను నిర్వహించారు. ఇంటర్వ్యూలు అయిన వెంటనే అక్కడికక్కడే నియామక పత్రాలు కూడా ఇచ్చారు. వెయ్యి ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా ఇంటర్వ్యూలు నిర్వహించారు. జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ ఎస్.కె అబ్దుల్ ఖయ్యూమ్, రీజినల్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ కిరణ్మయి పర్యవేక్షణలో కంపెనీల హెచ్‌ఆర్‌లు యువతీ యువకులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నారు. కూటమి నాయకుల నేతృత్వంలో వారందరికీ ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు సమకూర్చి జాబ్‌మేళాను విజయవంతంగా నిర్వహిస్తున్నారు. కళాశాల యాజమాన్యం సిబ్బంది పూర్తి సహాయ సహకారాలు అందిస్తున్నారు. కళాశాల కరస్పాండెంట్ కె.వి.రత్నం, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ గురజాల రామ్‌గోపాల్ తదితరులు జాబ్‌మేళాకు అన్ని వసతులు సమకూర్చడంతో పాటు మధ్యాహ్న భోజనాన్ని కూడా ఏర్పాటు చేశారు. కాకర్ల పొలిటికల్ మేనేజర్ మాలేపాటి చైతన్య, చంద్ర మానస, మండల కన్వీనర్లు గొంగటి రఘునాథరెడ్డి, గూడా నరసారెడ్డి, సర్పంచ్ నల్లగొండ్ల సృజన, సీనియర్ నాయకులు సుబ్బారెడ్డి,పోలినేని చంద్రబాబునాయుడు, తెలుగు యువత నాయకులు పర్యవేక్షిస్తున్నారు.

### జనసేన వేదికగా ఆత్మకూరులో పీ-4 కార్యక్రమం

# పేద విద్యార్థులకు 'జనసేన' సైకిళ్ళు

### అందజేసిన మంత్రి ఆనం, టిడ్కో ఛైర్మెన్ అజయ్



పాఠశాలలకు వెళ్లే పేద విద్యార్థులకు సాయంగా జనసేన పార్టీ ఆధ్వర్యంలో సైకిళ్ళు పంపిణీ చేశారు. ఆత్మకూరు నియోజకవర్గంలోని హసనాపురంలో ఇటీవల జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, టిడ్కో ఛైర్మెన్ వేములపాటి అజయ్ పాల్గొని, ఆ సైకిళ్లను పేదలకు అందజేశారు. జనసేన నాయకులు చదలవాడ హరీష్, మృదుల దంపతులు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సేవా భావాన్ని కొనసాగిస్తూ జనసేన పార్టీ తరపున సేవ చేయాలనే ఉద్దేశంతో ప్రతిరోజు కోలగట్ల నుంచి వాసిలి పబ్లిక్‌స్కూల్‌కి నడకదారిన వెళుతున్న విద్యార్థులకు సైకిళ్ళను ఇవ్వడం అభినందనీయ మంటూ వారు కొనియాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదలకు పీ-4 కార్యక్రమం కింద కూటమి ప్రభుత్వం చేయదలచిన కార్యక్రమాన్ని ఇక్కడి నుంచే సైకిల్ పంపిణీతో మొదలైందంటూ సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన సీనియర్ నాయకులు నూనె మల్లికార్జునయాదవ్, నాయకులు గునుకుల కిషోర్, సుందరరామిరెడ్డి, కృష్ణారెడ్డి, రవి, సురేష్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## అజయ్‌తో సరదాగా..చాయ్!



రాష్ట్ర టిడ్కో ఛైర్మెన్, జనసేన నేత వేములపాటి అజయ్‌కుమార్‌తో నెల్లూరు నగరంలోని జనసైనికులు పలు అంశాలపై ముచ్చటించారు. 'అజయ్ అన్నతో చాయ్' అంటూ, అందరూ కలసి టీ తాగి ఒకరినొకరు ఆత్మీయంగా మాట్లాడుకున్నారు. అజయ్‌తో కలసి ఫోటోలు దిగారు. జనసేన నాయకుడు గునుకుల కిషోర్ సతీమణి, 16వ డివిజన్ నాయకురాలు విజయలక్ష్మి ఆధ్వర్యంలో స్థానిక చిల్డ్రన్స్ పార్కు సెంటర్‌లోని శ్రీ ఆంజనేయస్వామి గుడివద్ద జరిగిన ఈ కార్యక్రమం సందడిగా జరిగింది. అజయ్ కుమార్‌తో కలసి మాట్లాడడం అందరికీ ఉత్సాహాన్నిచ్చింది. ఈ సందర్భంగా అజయ్ మాట్లాడుతూ, జనసైనికులు ప్రజలతో కలుస్తుండాలని, కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియజేస్తుండాలని చెప్పారు.

# అన్నమయ్య సంకీర్తనలతో.. మార్మోగిన శ్రీసిటీ




శ్రీసిటీ ఆధ్యాత్మిక సాహిత్య వేదిక శ్రీవాణి ఆధ్వర్యంలో ఇటీవల శ్రీసిటీ బిజినెస్ సెంటర్‌లో నిర్వహించిన 'అన్నమయ్య పదామృతవర్షిణి' కార్యక్రమం అందరినీ ఆకట్టుకుంది. హైదరాబాద్‌కు చెందిన ప్రఖ్యాత పండితుడు గంధం బసవశంకరరావు వ్యాఖ్యాతగా ఉండి అన్నమయ్య కీర్తనల్లోని గొప్పతనాన్ని వివరించారు. నెల్లూరుకు చెందిన కుమారి మల్లాది అనూష ఈ సందర్భంగా పలు అన్నమయ్య సంకీర్తనలను శ్రావ్యంగా ఆలపించి కరతాళధ్వనులందుకున్నారు. శంకరరావు తన ప్రసంగంలో ప్రజాకవి అన్నమయ్య అంటూ, శ్రీ వేంకటేశ్వరపాదాంకితంగా ఆయన చేసిన కీర్తనల ప్రాశస్త్యాన్ని వివరించారు. పలువురు ప్రముఖ కవులు తమ ప్రబంధ సాహిత్యాన్ని రాజులను మెప్పించేందుకు వాడితే, వేదాలలో వున్న సారాన్ని అచ్చ తెలుగులో సంగీతంగా మలచి వేంకటేశ్వరస్వామికి సమర్పించిన మహాకవి అన్నమయ్య అని అభివర్ణించారు. శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, అన్నమాచార్య రచనలు కేవలం భక్తి గీతాలు మాత్రమే కాదని, అవి ప్రజలను జాగృతం చేసే తత్వ బోధనలని అన్నారు. ఆ వారసత్వ సంపదను కొత్త తరాలకు వివరించే ఈ స్ఫూర్తిదాయక కార్యక్రమానికి శ్రీసిటీ-శ్రీవాణి వేదిక కావడం తమకు గర్వకారణం అని తన సందేశంలో పేర్కొన్నారు. తిరుపతి శ్వేతా మాజీ డైరెక్టర్ భూమన్, ఎస్ కె యూనివర్సిటీ మాజీ ఉప కులపతి కుసుమ కుమారి, కళాకారులను సత్కరించారు. శ్రీసిటీ పీఆర్‌ఓ పి.బాలాజీ ఈ కార్యక్రమ సమన్వయకర్తగా వ్యవహరించారు.

# ప్రజల సమస్యలు తీరుస్తూ..'తొలి అడుగు'

**• మంత్రి ఆనం రామనారాయణరెడ్డి**



రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సారధ్యంలో ఈనెల 1న ఆత్మకూరు నియోజకవర్గంలోని 278 బూత్‌ల పరిధిలో ప్రారంభమైన 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమం విజయవంతమైంది. ఆత్మకూరు ఒకటో వార్డు ముస్తాపురంలో ఆయన ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇంటింటికీ వెళ్ళి, ఈ ఏడాది కాలంలో ప్రభుత్వం అందించిన పాలన పట్ల ప్రజల అభిప్రాయం తెలుసుకున్నారు. సర్వత్రా ప్రజల నుంచి కూటమి ప్రభుత్వానికి ఆదరణ లభిస్తుండడంతో ఆయన సంతోషం వ్యక్తం చేశారు. తొలిరోజు 30 ఇళ్లకు పార్టీ శ్రేణులతో కలిసి వెళ్లి, ఆ కుటుంబాల వారికి సంక్షేమ పథకాలను వివరిస్తూ కర పత్రాలు అందించి, ఆ కుటుంబ సభ్యులు పొందిన ప్రభుత్వ పథకాల లబ్ధి తెలుసుకుని, ఇంకా ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగారు. ప్రజల సమస్యలు తెలుసుకుంటూ, ఆ సమస్యల పరిష్కారానికి ఆయన వెంటనే చర్యలు తీసుకోవడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం మాట్లాడుతూ, సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంతో నూతన వరవడికి శ్రీకారం చుట్టామన్నారు. ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలోని తెలుగుదేశం పార్టీ, జనసేన, బిజెపి పార్టీలతో కూడిన ఎన్డీఏ కూటమి ప్రభుత్వ సుపరిపాలనలో తొలిఅడుగు పూర్తయిందని అన్నారు. ప్రజలకు పారదర్శకమైన, వేగవంతమైన పాలన అందించడమే లక్ష్యంగా ప్రతి ఇంటికి వెళ్లి, ఆ కుటుంబసభ్యులతో కలసి వారి కష్టసుఖాలు తెలుసుకుంటున్నామన్నారు.

# సోమిరెడ్డి సారధ్యంలో 438 మందికి ఉద్యోగాలు



రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సోమిరెడ్డి ఫౌండేషన్ సంయుక్తంగా ఇటీవల స్థానిక విక్రమసింహపురి విశ్వవిద్యాలయంలో చేపట్టిన జాబ్ మేళాకు 1403 మంది యువత హాజరయ్యారు. మొదటి విడతలో 438 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వారందరికీ సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఆయన తనయుడు రాజగోపాల్‌రెడ్డి, కోడలు శృతిరెడ్డిలు ఉద్యోగ నియామక పత్రాలనందజేశారు. షార్ట్‌లిస్ట్‌లో మరో 106 మంది కూడా ఉన్నారు. సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ, త్వరలోనే మనుబోలులో ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటు చేస్తామన్నారు. ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన జాబ్‌మేళాల్లో సర్వేపల్లిలోనే అత్యధికంగా 1403 మంది హాజరయ్యారని, జాబ్‌మేళా విజయవంతం కావడం సంతోషంగా ఉందన్నారు. యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు 34 కంపెనీలు ముందుకు రావడం శుభ పరిణామమన్నారు. ప్రస్తుతం అవకాశం రాని వారికి కూడా వివిధ కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు సోమిరెడ్డి ఫౌండేషన్ కృషి చేస్తుందన్నారు. కూటమి ప్రభుత్వం రాకతో యువతకు ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు, జాబ్ మేళాలతో రాష్ట్రానికి మళ్లీ పూర్వవైభవం వచ్చిందని అన్నారు. ముత్తుకూరు మండలం కృష్ణపట్నంలోని రిలయన్స్ భూముల్లో సోలార్ ప్యానెల్ తయారీ ప్లాంట్లు ఏర్పాటు చేస్తామంటున్నారు.. అవి కూడా త్వరగా ఏర్పాటైతే చాలామందికి ఉద్యోగాలు లభిస్తా యని ఆయన తెలిపారు.

# విపిఆర్ దంపతుల రాకతో..చిన్నారుల కేరింత



తమ ఇళ్ల వద్దకు వేమిరెడ్డి దంపతుల రాకతో చిన్నారులు కేరింతలు కొట్టారు. విద్యార్థులు పరుగెత్తుకుంటూ వారి వద్దకు వచ్చారు. మీకు తల్లికి వందనం డబ్బులు పడ్డాయా అని అడగ్గానే ఎస్ మేడం..వచ్చేశాయి అని బిగ్గరగా చెప్పారు. వారి ఉత్సాహం చూసి వేమిరెడ్డి దంపతులు కూడా ఆనందించారు. నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి.. ఆయన సతీమణి కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిలు బుధవారం బుచ్చిరెడ్డిపాళెంలో ఇంటింటి ప్రచారంలో పాల్గొన్నారు. 17వ వార్డులో పర్యటిస్తుండగా, ఓ మిద్దెపై ట్యూషన్‌లో ఉన్న విద్యార్థులు వారిని చూడగానే 'మేడమ్ వచ్చారు..సార్ వచ్చారంటూ' చకచకా కిందికి దిగారు. వారిద్దరి చుట్టూచేరి, 'సార్..మేడమ్.. నమస్తే సార్.. అంటూ పలకరించారు. వారి సంతోషానికి వేమిరెడ్డి దంపతులు కూడా మురిసిపోయి, వారితో కాసేపు ఆత్మీయంగా మాట్లాడారు. పిల్లలందరికీ బిస్కెట్లు పంచిపెట్టి తాము కూడా ఆనందించారు.

# ప్రముఖ ఇంద్రజాలికుడు..బీవీ పట్టాభిరామ్ కన్నుమూత!



ప్రముఖ ఇంద్రజాలికుడు..అంతర్జాతీయ ఖ్యాతి పొందిన హిప్నాటిస్టు..రచయిత..వ్యక్తిత్వ వికాస నిపుణుడు బీవీ పట్టాభిరామ్(75) ఇక లేరు. గుండెపోటుతో జూన్ 31న హైదరాబాద్‌లోని తన నివాసంలో ఆయన తుదిశ్వాస విడిచారు. ఆయన పూర్తిపేరు భావరాజు వెంకట పట్టాభిరామ్. స్వస్థలం తూర్పుగోదావరిజిల్లా శీల గ్రామం. చిన్నతనంలో చందమామ కథలు చదివి ఆ స్ఫూర్తితో ఆయన ఎదిగారు. ఓ ఇంద్రజాలికుడి ప్రదర్శన చూసి, ఆ విద్యపై ఆసక్తితో ఇంద్రజాలం నేర్చుకుని అనేక ప్రదర్శనలతో విఖ్యాతి పొందారు. 1984లో కళ్ళకు గంతలు కట్టుకుని చార్మినార్ నుంచి రవీంద్రభారతి వరకు స్కూటర్ నడిపి సంచలనం సృష్టించాడు. మూఢనమ్మకాలు, చేతబడులు నమ్మవద్దంటూ తన ఇంద్రజాల విద్యద్వారా వేలాది ప్రదర్శనలతో చైతన్యవంతం చేశారు. ఉస్మానియా యూనివర్శిటీలో చదువుకుని, హిప్నాటిజంపై తొలి పీహెచ్‌డీ కూడా పట్టాభిరామ్‌దే కావడం విశేషం. ఫ్లోరిడా యూనివర్శిటీ నుంచి గౌరవ డాక్టరేట్ కూడా అందుకున్నారు. ఆయన మృతితో తెలుగునేల ఒక గొప్ప వ్యక్తిని, పేరెన్నికగన్న ఇంద్రజాలికుడిని కోల్పోయినట్లయింది.

లాయర్
జులై 04, 2025

# 'డెంగ్యూ' వ్యాధి పట్ల అప్రమత్తత అవసరం

చూసేందుకు దోమలు చిన్నవే కానీ.. అవి తెచ్చే వ్యాధులు మాత్రం చాలాపెద్దవి. ఒక్కోసారి అవి ప్రాణాలమీదికి కూడా తెచ్చేస్తుంటాయి. మనిషికి వచ్చే రకరకాల వ్యాధుల్లో దోమల నుంచి వచ్చే వ్యాధులు అనేకం ఉన్నాయి. వాటిలో ప్రాణాంతకంగా ఉండే వ్యాధుల్లో 'డెంగ్యూ వ్యాధి' ఒకటనేది అందరికీ తెలిసిందే. ఇది ఒక్క మనదేశంలోనే కాదు, ప్రపంచ మంతా ఉంది. ప్రత్యేకించి ఉష్ణమండలాల్లో ఇదో పెద్ద సమస్యగా ఉంటోంది. ప్రపంచ వ్యాప్తంగా ప్రతి ఏటా లక్షలాది డెంగ్యూ కేసులు వస్తూనే ఉన్నాయి.. వేలాదిమంది మరణిస్తూనే ఉన్నారు. ఒక్క 2023లో ప్రపంచంలో డెంగ్యూ బారినపడి అయిదున్నర వేలమంది మరణించినట్లు అధికారిక లెక్కలే చెప్తున్నాయి. ఇది 2022 కంటే 32శాతం ఎక్కువ కావడం గమనార్హం. ప్రపంచ ఆరోగ్యసంస్థ (డబ్ల్యుహెచ్ఓ) నివేదికల ప్రకారం డెంగ్యూ కేసులు ఏటా పెరుగుతున్నాయే తప్ప తరగడం లేదు. మనదేశంలో కూడా ఈ కేసులు ఎక్కువగానే ఉంటున్నాయి. గతంలో కన్నా ఇప్పుడు మరణాల సంఖ్య తగ్గిందికానీ, డెంగ్యూవ్యాధి మాత్రం విపరీతంగానే ఉంటోంద న్నది నిపుణుల మాట. అందులోనూ ఇది వర్షాకాలం..డెంగ్యూ కాలమన్నమాటే. సాధారణంగా జూన్ నుంచి డిసెంబర్ మధ్య కాలంలో ఈ వ్యాధి ప్రబలుతూ ఉంటుంది. అందుకే, ప్రభుత్వం ఇప్పుడు 'డెంగ్యూ మాసోత్సవాలు' జరుపుతూ, ప్రజలను ఈ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిస్తోంది. దేశంలో 2021 నుంచి ఏటా లక్షా 90వేల నుండి 2 లక్షలా 89 వేల కేసుల దాకా పెరుగుదల ఉంటోందని నిపుణులు వెల్లడిస్తున్నారు. 2022లో 63వేల కేసులు నమోదైతే, 2024లో 2 లక్షలా 30వేల కేసుల దాకా పెరగడం చూస్తే ఈ వ్యాధి చాపకింద నీరులా ఎంత వేగంగా వ్యాపిస్తు ఉందో అర్థమవుతుంది. అయితే, ప్రభుత్వాలు తీసుకుంటున్న చర్యల వల్ల మరణాలు బాగా తగ్గుతున్నాయనడంలో ఎలాంటి సందేహం లేదు.

'ఈడిస్ ఈజిప్ట్' అనే రకం దోమలు కుట్టడం వల్ల వైరస్ వ్యాపించి, అది డెంగ్యూగా మారుతుందని వైద్య నిపుణులు చెప్తున్నారు. హఠాత్తుగా తీవ్రమైన జ్వరం రావడం, భరించ లేనంతగా తలనొప్పి, వొళ్ళ నొప్పులు, కీళ్ళ-కండరాల నొప్పులు, వాంతులు వంటివి డెంగ్యూ ప్రాథమిక లక్షణాలు. ఇవి కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించి తగు చికిత్సలు చేయించుకోవాల్సి ఉంటుంది. బొప్పాయి ఆకుతోనో, లేదా రసాలతోనో డెంగ్యూని తగ్గించుకోవచ్చని కొందరంటూ ఉంటారుకానీ, అవేమీ శాస్త్రీయంగా రుజువు కాలేదు. అలాంటివాటిని నమ్ముకుని ఆసుపత్రులకు వెళ్లకుంటే ప్రమాదమే మరి!. సొంత వైద్యం ప్రాణాంతకమనే సామెత ఉండనే ఉంది కదా!.. ఇలాంటి ప్రమాదకరమైన వ్యాధుల పట్ల ఏమాత్రం అలక్ష్యంగా ఉన్నా పెద్ద కష్టాలే వస్తాయి. అసలు ఇలాంటి వ్యాధులకి మూలకారణం దోమలే. అవి లేనిచోటు ఎక్కడుంటుందీ?.. అవే సర్వాంతర్యాములైపోయాయి. ఏ ఊరుచూసినా, ఏ వాడ చూసినా, ఏ ఇల్లు చూసినా అవే. దోమలను నివారించుకోవా లంటే ముందు మురుగును వదిలించుకోవాలి. పరిశుభ్రత పాటించాలి. చుట్టూ పరిసరాలను కూడా శుభ్రంగా ఉండేలా చూసుకోవాలి. మనదేశంలో ఎక్కడ చూసినా మురుగు కాలువలు, చెత్తకుప్పలే ఎక్కువ. అవే దోమల ఆవాసాలు. పరిసరాలు గబ్బుకొట్టిపోతున్నా, రకరకాల కాలుష్యాలు కాటేస్తున్నా, దోమలు కుట్టేస్తున్నా ప్రభుత్వాలకు దోమ కుట్టినట్లు కూడా ఉండడం లేదు. గ్రామాల్లో పంచాయతీలకు నిధులు కొరత కావడంతో, ఎక్కడ మురుగు అక్కడే ఉంటోంది.

ఇకనైనా ప్రభుత్వాలు, వైద్యబృందాలు, ప్రజలు అందరు కలిసి ప్రతి గ్రామంలోనూ డెంగ్యూ నివారణకు రంగంలోకి దిగాలి. ఎక్కడా చెత్తా చెదారం లేకుండా శుభ్రం చేసుకోవాలి. మురుగు కాలువల్లో దోమలు పుట్టకుండా, అవి పెరిగి అందరినీ కుట్టకుండా కట్టుదిట్టం చేసుకోవాలి. వీలైతే తలుపులు, కిటికీలకు దోమలు రాకుండా నెట్ బిగించుకోవాలి. లేదంటే దోమతెరలు తప్పనిసరిగా వాడుకోవాలి. మనదాకా వస్తే చూసుకుందాంలే.. అనే నిర్లక్ష్యధోరణి పనికిరాదు. డెంగ్యూ అనే కాదు, ఏ వ్యాధి అయినా, వచ్చాక నరకయాతన పడే కంటే, ముందు జాగ్రత్తలు తీసుకోవడమే అన్ని విధాలా శ్రేయోదాయకం. ఈ డెంగ్యూ మాసాల్లో ఆ వ్యాధి పట్ల వైద్య బృందాలు ప్రజల్లో బాగా అవగాహన కల్పించాలి. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొనేలా చూసుకోవాలి. అప్పుడే ఆ దోమలను.. ఈ వ్యాధిని కొంత మేరకైనా అరికట్టుకోవచ్చు!

(జులై 1 నుంచి 31 దాకా..
'ప్రపంచ డెంగ్యూ నివారణ మాసోత్సవాల' సందర్భంగా)

# అభివృద్ధి కావాలంటే ఇలాంటి నేతలు ఉండాలి!




నెల్లూరు నగరానికి మహర్దశ పట్టినట్లు కనిపిస్తోంది. నెల్లూరు నగరం మరియు రూరల్‌లో పార్కులు కళకళలాడుతున్నాయి. రోడ్లు మిలమిల మెరుస్తున్నాయి. సైడు కాలువలు జలజలా పారుతున్నాయి. వీధి లైట్లు ధగధగా వెలుగులు చిమ్ముతున్నాయి. రోడ్డు మీడియంలు, వంతెనలు కళాత్మక చిత్రాలతో నిండిపోయాయి. నగర ఎంఎల్ఏ మరియు మునిసిపల్ మంత్రి పొంగూరు నారాయణ, రూరల్ ఎంఎల్ఏ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఇద్దరూ అభివృద్ధిలో పోటీపడుతున్నారు. నువ్వా-నేనా అన్నట్లుగా నెల్లూరు నగరాన్ని అభివృద్ధిలో పరుగులు పెట్టిస్తున్నారు. ఇది మంచి సంప్రదాయం. అవినీతి, అక్రమ సంపాదన, దుర్మార్గాలు, దౌర్జన్యాలు, దోపిడీలలో కాకుండా ఇలా ప్రజల అవసరాలు గుర్తించి సమస్యలు తీర్చడంలో ఈ ఇద్దరు నాయకులు చూపిస్తున్న చొరవ అభినందనీయం. ఇదే స్ఫూర్తితో నగరంలో ఇష్టారాజ్యంగా జరుగుతున్న దురాక్రమణలు (అన్నమయ్య కూడలే పెద్ద ఉదాహరణ), అస్తవ్యస్తమైన ట్రాఫిక్ వ్యవస్థలపై కూడా ఈ ఇద్దరు నేతలు నిస్వార్థంగా దృష్టి పెట్టాలని కోరుతున్నాను. ఇలాంటి నేతలు రాజకీయాలలో చాలా అవసరం. వీరిద్దరినీ ఆదర్శంగా తీసుకుని మిగిలిన లీడర్లు కూడా తమ తమ నియోజకవర్గాలని ప్రగతి పథంలో పరుగులు పెట్టిస్తారని ఆశిద్దాం!..

ఆర్.వీ.రామయ్య, కొండాయపాలెం.

# మానవతామూర్తి వీపీఆర్!

నెల్లూరు పార్లమెంటు సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి చేస్తున్న ఆధ్యాత్మిక, ధార్మిక, సేవా కార్యక్రమాలని మన 'లాయర్' ద్వారా గమనిస్తుంటే ఆయనని మానవత్వం మూర్తీభవించిన కనిపించే దైవం అని సంభోధించాలనిపిస్తోంది. నెల్లూరుజిల్లాలోని మారుమూల ప్రాంతాలలో సైతం తమ ఫౌండేషన్ ద్వారా వాటర్‌ప్లాంట్లని ఏర్పాటు చేస్తున్నారు. తద్వారా కొన్ని వేలమంది దాహార్తిని తీరుస్తున్న అపర భగీరథుడు వీపీఆర్. అంతేకాకుండా ఇప్పటికే సుమారు వెయ్యిమందికిపైగా వికలాంగులకు ట్రై సైకిళ్ళని ఉచితంగా అందించి వాళ్ళ బ్రతుకులకి ప్రభాకరరెడ్డి భరోసా కల్పించారు. కొన్ని అనాథ ఆశ్రమాలకి, వృద్ధాశ్రమాలకి, మానసిక వికలాంగుల పునరావాస కేంద్రాలకి నిత్యం ఆర్థిక సహాయ సహకారాలు అందిస్తూ వాళ్ళ జీవితాలలో వెలుగులు నింపుతున్నారు. వీపీఆర్ విద్య, వైద్యం పేరుతో అంతర్జాతీయ ప్రమాణాలతో ఒక స్కూలుని, ఆసుపత్రిని నెలకొల్పి పేదవారికి ఉచితంగా కార్పొరేట్ విద్య, వైద్యం అందిస్తున్నారు. పై కార్యక్రమాలన్నీ ఆయన ప్రత్యక్ష రాజకీయాలలోకి రాకముందు నుండి రాజకీయాలకి అతీతంగా చేస్తున్నవే. ఇప్పుడు ప్రత్యక్ష రాజకీయాలలోకి వచ్చి పార్లమెంటు సభ్యుడిగా గెలిచిన తరువాత ఆయన సేవలని మరింత విస్తృత పరచారు. తన సతీమణి, కోవూరు శాసనసభ్యురాలు ప్రశాంతిరెడ్డితో కలిసి నిత్యం ప్రజాహిత కార్యక్రమాలలో పాల్గొంటున్నారు. ఇలాంటి నిస్వార్థ రాజకీయ నేతలు బహుఅరుదుగా కనిపిస్తారు. సేవాతత్పరులుగా సమాజంలో కీర్తించబడుతున్న ప్రభాకరరెడ్డి గారి దంపతులకి నా అభినందనలు.

– డి.హరిత, గూడూరు.

# సమరంతో పాటు అప్రమత్తత అవసరం!

మాదకద్రవ్యాలపై గత వారం 'లాయర్' సంపాదకీయం సమర్థనీయంగా వుంది. మాదకద్రవ్యాల మత్తులో సమాజం... ముఖ్యంగా యువత కూరుకు పోతోంది. ఈ మాదకద్రవ్యాల మాఫియాని నియంత్రించడం ఆషామాషీ విషయం కాదు. ఈ విషయంలో నిరంతర సమరం చాలా అవసరం. అదే క్రమంలో అప్రమత్తత కూడా అంతే అవసరం.

సి.ఆర్.విశ్వేశ్వరరావు,
మాజీ ఉపకులపతి, హైదరాబాదు.




# విజ్ఞానం ఆకాశానికి.. విలువలు అధఃపాతాళానికి!

కలలో కూడా ఊహించని విధంగా, ఎక్కడో ఆకాశంలో నీలిమేఘాలలో దోబూచులాడుతున్న చందమామపై అడుగుపెట్టడం, భూమిపై నుంచే గగనాన్నంతా శోధించే అపార సాంకేతిక పరిజ్ఞానంతో మానవుడు అజేయంగా నిలుస్తుండడం సకల మానవాళికీ గర్వకారణం. మొన్నటికి మొన్న, దేశమంతా గర్వపడేవిధంగా మన భారతీయుడు శుభాంశు శుక్లా రోదసిలోకి దూసుకుపోయాడు. అంతరిక్షంలో ఉన్న అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి చేరుకున్నాడు. అక్కడి నుంచి తన సహచర వ్యోమగాములతో కలిసి గ్రహాల గుట్టుమట్లను శోధించేందుకు అద్వితీయ పరిశోధనలు చేయడం మొదలుపెట్టాడు. వారు అంతరిక్షంలో ఏం చేస్తున్నారో కూడా మనకు కనిపించడం, వారి మాటలు వినిపించడం, అదో అద్భుత అనుభూతి.

మానవుడు తలచుకుంటే ఏమైనా చేయగలడు, దేన్నైనా సాధించగలడు అనడానికి ఇంతకన్నా నిదర్శనాలు అవసరం లేదు. అయితే, ఇదంతా నాణానికి ఒకవైపు మాత్రమే. అంతులేని విజ్ఞానంతో మనిషి లెక్కలేనన్ని విజయాలు సాధిస్తున్నా, మరోవైపు అంతకన్నా ఎక్కువగా అజ్ఞానంతో, అలక్ష్యంతో, అహంకారంతో తన గోతిని తానే తవ్వుకుంటున్నాడు. విశ్వాన్నంతా జయించేస్తున్నామనే గర్వంతో పంచభూతాలను ధిక్కరిస్తూ, ప్రకృతిని సైతం నాశనం చేస్తూ చేజేతులా నెత్తిమీదికి విపత్తులను తెచ్చుకుంటున్నాడు. ముఖ్యంగా, మనిషన్నవాడికి ఉండాల్సిన కనీస మానవత్వాన్ని కూడా విస్మరించి, రాక్షస ప్రవృత్తితో తన పతనాన్ని తానే కొని తెచ్చుకుంటున్నాడు. నేటి ఆధునికకాలంలో అత్యాధునిక సాంకేతికత్వంతో రాకెట్టు వేగంతో ఆకాశంలోకి దూసుకుపోతున్న మనిషిని చూసి గర్వపడాలా?... లేకుంటే అజ్ఞానంతో, అష్ట దరిద్రాలతో అట్టడుగుకి కుంగిపోతున్న మనుషులను చూసి బాధపడాలా? అన్న అర్థం కాని అయోమయ పరిస్థితి సామాన్యుడి నుండి మేధావులవరకు కలచివేస్తోంది.

## ఒకడుగు ముందుకి.. ఆరడుగులు వెనక్కి:

సంస్కృతికీ, సంప్రదాయాలకి విశ్వగురువుగా భావించే మన దేశంలోనూ పాశ్చాత్య ధోరణులు ప్రబలిపోతున్నాయి. అధునాతనం పేరుతో అరాచకత్వం ప్రబలిపోతోంది. సర్వత్రా స్వార్థం పెరిగిపోయింది. ధనాశ సమాజాన్ని పూర్తిగా అథోగతి పాలుచేస్తోంది. రాజకీయాలు కలుషితమైపోయాయి. ఫలితంగా ఎక్కడ చూసినా అన్యాయాలు, అరాచకాలు రాజ్యమేలుతున్నాయి. కక్షలు కార్పణ్యాలు పెరిగిపోయాయి. కులమతాల రగడలు ఎక్కువయ్యాయి. దేశంలో ఎంతోకాలం నుంచి రకరకాల భాషలు మాట్లాడే వారున్నా, భిన్నత్వంలో ఏకత్వం సాధించిన మనదేశం, ఇప్పుడు భాషాభేదాలతో రచ్చకెక్కుతుండడం విచారకరం. మానవ జన్మకు పరమార్థంగా భావించే సేవాభావాన్ని, ఆధ్యాత్మిక జీవనాన్ని ఆచరిస్తూ, సత్యధర్మాలను పాటిస్తూ, దేశభక్తికీ-దైవభక్తికీ పతాకగా నిలిచి శాంతియుత జీవనంలో ప్రపంచానికే మకుటాయమానంగా ఉండాల్సిన మనదేశంలో కూడా అకృత్యాలు, అమానుషత్వాలు విజృంభిస్తుండడం దారుణం! అనైతికత్వం, అసమానత్వం అన్నీ కలసి మహోన్నతమైన మనదేశ సంస్కృతిని కబళించేస్తున్నాయి. మంచి వ్యవస్థలన్నీ నాశనమవుతున్నాయి. పౌష్టికాహారం తిని ఆరోగ్యంగా ఉండాల్సిన వారు, పిజ్జాలు బర్గర్లు తింటూ నానా రకాల రోగాలతో బాధలు పడుతున్నారు. ఆధునిక జీవనశైలితో వచ్చిన మార్పులు జీవితాలను అంధకార బంధురం చేస్తున్నా, అత్యధికశాతం మంది ఆ ఊబిలోనే కూరుకుపోతుండడం ఆ అవ్యవస్థలకు ఓ చిన్న ఉదాహరణ మాత్రమే!...

## సాంస్కృతిక పునరుజ్జీవనం అవసరం :

ప్రపంచాన్నే ఆకట్టుకున్న నాటి భారతీయ మహనీయ జీవన విధానం, ఆచార వ్యవహారాలు, సంప్రదాయాలు, అపూర్వమైన కళలు, సారస్వతారాధన, సమాజానికి వెన్నెముకగా ఉండే కుటుంబ వ్యవస్థ, మొత్తంగా అపూర్వమైన మన సంస్కృతి నానాటికీ క్షీణించిపోతుండడం బాధాకరం. గతంలో ఉన్నంత ఆత్మీయతలు, ప్రేమానురాగాలు ఇప్పుడు ఉండడం లేదు. బంధాలు, అనుబంధాలు, చివరికి రక్తసంబంధాలు కూడా క్రమేణా కనుమరుగైపోతున్నాయి. స్త్రీని దేవతగా పూజించే మనదేశంలో కూడా పబ్‌ల పేరుతో స్త్రీలను హీనంగా చూస్తూ, నృత్యాలు చేయిస్తున్నారు. తల్లిని, చెల్లిని చూసుకున్నట్లుగానే గౌరవంతో చూడాల్సిన మహిళలపై అత్యాచారాలకు, అఘాయిత్యాలకు పాల్పడుతున్నారు. నైతిక విలువలకి ప్రాధాన్యతనిచ్చే మనదేశంలో వాటి స్థానం ఇప్పుడు పాతాళంలోకి పడిపోయింది. ఫలితంగా దేశ ప్రగతి కూడా ఒకడుగు ముందుకు.. ఆరడుగులు వెనక్కి అన్నట్లుగా తయారయ్యింది. ఈ దుర్దశ నుంచి దేశం బయటపడాల్సి ఉంది. ప్రభుత్వాలు మేల్కొని దారి తప్పిపోతున్న మన వ్యవస్థలను మంచిదారిలో నడిపించాల్సి ఉంది. మాయమవుతున్న మంచినీ మానవత్వాన్నీ నిలబెట్టుకోవాల్సి ఉంది. విజ్ఞులు, అనుభవజ్ఞులు, మేధావులందరితో సంప్రదించి మన సంప్రదాయలను, సంస్కృతిని పరిరక్షించుకునేందుకు సత్వర చర్యలు తీసుకోవాల్సి ఉంది. నేటి ఆధునిక కాలంలోనే కాదు, ఏకాలంలోనైనా సరే సరైన ఆలోచనా ధోరణే ముఖ్యం. విజ్ఞానంతో వివేకంతో మంచి నిర్ణయాలు తీసుకోవడం ప్రధానం. వైషమ్యాలను విడనాడి నైతిక విలువలను కాపాడుకుంటూ, ఏది మంచో, ఏది చెడో తెలుసుకుంటూ, సమాజ పురోగతికి బాటలు వేసుకునే విధానాలనే జీవన విధానాలుగా ఆచరించినప్పుడే సత్ఫలితాలుంటాయి. ఒక్కమాటలో చెప్పాలంటే, దేశానికి ఇప్పుడు సాంస్కృతిక పునరుజ్జీవం అవసరం. ప్రభుత్వాలు అన్ని కోణాల్లో ఆలోచించి అందుకు అవసరమైన వ్యవస్థలను రూపొందించాలి. మన సంస్కృతిని, సంప్రదాయాలని మనం రక్షించుకోవడమంటే మనల్ని మనం రక్షించుకోవడమే. అది, మన వ్యక్తిగత ప్రగతికే కాదు, దేశ సర్వతోభివృద్ధికి మేలుబాటలు వేస్తుంది. మొత్తంగా, దేశానికే రక్షాకవచంగా మారుతుంది...!

- రాజశ్రీ




# పింఛన్ల పథకం చరిత్రాత్మకం

## సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి

రాష్ట్రంలోని పింఛన్ల పథకం దేశంలోనే చరిత్రాత్మకమని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి చెప్పారు. జులై 1న వెంకటాచల మండలం ఇస్కపాళెంలో లబ్ధిదారులకు ఆయన పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఒక్కో లబ్ధిదారునికి ఏడాదికి రూ.48 వేలు నుంచి రూ.1.80 లక్షల వరకు పింఛను అందుతోందన్నారు. పింఛన్‌ను రూ.3 వేలు నుంచి రూ.4 వేలకు పెంచిన ఘనత కూడా చంద్రబాబునాయుడిదేనన్నారు. ప్రభుత్వం ఏడాదికి రూ.33 వేల కోట్ల రూపాయలను పింఛన్ల కోసం ఖర్చు పెడుతోందన్నారు. కొత్తగా వితంతువులకు కూడా ఈ నెల నుంచే పింఛన్ అందించబోతున్నారన్నారు. తెలుగుదేశం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో అభివృద్ధి వేగం పుంజుకుందని, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి సారథ్యంలో త్వరలోనే అమరావతిలో ఏర్పాటుకానున్న 'క్వాంటమ్ వ్యాలీ' దేశానికే దిక్సూచిగా నిలవనుందన్నారు. రాష్ట్రంలోని మహిళలకు ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇప్పటికే అందిస్తున్నామని, తల్లికి వందనం పథకం అమలులోకి తెచ్చి ఎంతమంది పిల్లలుంటే అందరికీ వర్తింపజేశారని తెలిపారు. ఈ నెలలోనే 'అన్నదాత సుఖీభవ' పథకం అమలులోకి రానుందని, ప్రతి రైతుకు రూ.20 వేలు అందించనుందని చెప్పారు. ఆగస్టు 15వతేదీ నుంచి మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం అందుబాటులోకి వస్తుందన్నారు. సర్వేపల్లి నియోజకవర్గ వ్యాప్తంగా రూ.121 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు.

## తంబళ్లపల్లి టీడీపీ ఇన్‌చార్జిగా..

# పోలంరెడ్డి దినేష్‌రెడ్డి



తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సంస్థాగత ఎన్నికల నిర్వహణలో భాగంగా, అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లి నియోజకవర్గానికి పార్టీ పరిశీలకుని (అబ్జర్వర్)గా ఏపీఐఎంసిల్ ఛైర్మెన్ పోలంరెడ్డి దినేష్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన ఇటీవల తంబళ్లపల్లి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ దాసరపల్లి జయచంద్రరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి సాంబశివరావు, తదితర ప్రముఖులతో సమావేశమయ్యారు. సాధికార సారథుల పరంగా పార్టీ నిర్మాణంపై చర్చించారు. తెలుగుదేశం పార్టీని ఒక శక్తివంతమైన సంస్థగా మార్చేందుకు ప్రతి నాయకుడు, ప్రతి కార్యకర్త, తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులంతా కలిసికట్టుగా పనిచేయాలని ఈ సందర్భంగా దినేష్‌రెడ్డి పిలుపునిచ్చారు.

# తప్పిపోయిన బిడ్డను..పోలీసులు కాపాడారు



రాత్రి తమతో పాటు నిద్రించిన పాప, తెల్లారి లేచి చూసేసరికి కనిపించకపోవడంతో ఆ తల్లితండ్రులు ఎంతో కంగారుపడి, పోలీసులకు తెలియజేశారు. పోలీసులు వెంటనే ఆ పాప ఆచూకీ కనుక్కొని, తల్లితండ్రులకు అప్పగించడంతో కథ సుఖాంతమైంది. వివరాలిలా ఉన్నాయి. నెల్లూరురూరల్ మండలం నాల్గవ మైలుకు చెందిన షేక్ జలీల్, తన భార్యతో కలసి స్థానిక భగత్‌సింగ్ కాలనీలోని టిడ్కో ఇంట్లో ఉన్న తమ పరిచయస్తుల ఇంటికి వెళ్లారు. రాత్రివేళ కావడంతో అక్కడే పడుకున్నారు. ఉదయం లేచి చూస్తే, తమ మూడేళ్ల పాప షేక్ భవ్య ఎక్కడకి వెళ్లిందో తెలియలేదు. ఎంత వెదికినా కనిపించకపోయేసరికి, వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. నెల్లూరు నవాబుపేట పోలీస్ ఇన్స్‌పెక్టర్ వేణుగోపాలరెడ్డి తన సిబ్బందితో రంగంలోకి దిగి, ఆ చుట్టుపక్కలంతా గాలించి, ఎట్టకేలకు ఆ సమీప ప్రాంతంలోనే ఉన్న పాపను తల్లితండ్రులకు అప్పగించారు. దాంతో ఆ తల్లితండ్రులు ఆనందంతో తమ బిడ్డకు ఎలాంటి ఆపద రాకుండా కాపాడారంటూ పోలీసులకు కృతజ్ఞతలు చెప్పుకున్నారు.

## 'ఇంటింటికీ తెలుగుదేశం' కార్యక్రమాన్ని

# విజయవంతం చేయండి

## ప్రజా సమస్యలు పరిష్కరించడమే నాయకత్వ లక్షణం

### - నాయకులకు దిశానిర్దేశం చేసిన ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి



అధికారులతో సమన్వయం చేసుకుంటూ ప్రజా సమస్యలు పరిష్కరించడమే నాయకత్వ లక్షణమని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి చెప్పారు. కసుపర్తిపాడులోని విపిఆర్ కన్వెన్షన్‌లో ఇటీవల జరిగిన 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో పాల్గొన్న ఆమె, కోవూరు నియోజకవర్గ పరిధిలోని బూత్ కన్వీనర్ల నుంచి మండల పార్టీ అధ్యక్షుల వరకు పార్టీలో వివిధ పదవులలో వున్న నాయకులకు ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వం సాధించిన పార్టీ విధి విధానాల గురించి వివరించారు. ఈ సందర్భంగా ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ, పాలనా దక్షత కలిగిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాయకత్వంలో పని చేసే అవకాశం దక్కడం తన అదృష్టంగా భావిస్తున్నానన్నారు. పంచాయతి స్థాయిలో ప్రతి నాయకుడు ప్రజలతో మమేకమై పనిచేయాలని ఆమె సూచించారు. ఏడాది కాలంలో ప్రభుత్వం అమలుచేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల గురించి టీడీపీ నాయకులంతా ఇంటింటికెళ్లి ప్రజలకు వివరించాలని కోరారు. పార్టీ జెండా మోసిన కార్యకర్తలకు న్యాయం చేసేందుకు ఎల్లప్పుడూ తాను కృషి చేస్తానన్నారు. తాను ఎవరి పట్ల వివక్ష పాటించేది ఉండదని స్పష్టం చేశారు. ఖాళీ ఖజానాతో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టినా ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తుందన్నారు. అస్తవ్యస్తంగా మారిన పాలనా వ్యవస్థలను సరిదిద్దుకుంటూ ప్రజలకు ఎప్పుడు ఏది అవసరమో తెలిసిన కుటుంబ పెద్దగా చంద్రబాబునాయుడు జనరంజక పాలన అందిస్తున్నారన్నారు. అర్హులైన వారందరికీ ప్రభుత్వం పథకాలను అందిస్తోందన్నారు. 'తల్లికి వందనం' పథకం ద్వారా ఇంట్లో బడిఈడు పిల్లలు ఎంత మంది వుంటే అందరికీ ఆర్థిక సహాయం అందించిందన్నారు. గతంలో తట్టెడు మట్టికి నోచుకోని రోడ్లు..కూటమి ప్రభుత్వంలో బాగుపడ్డాయన్నారు. టీడీపీ కోవూరు నియోజకవర్గ ఇంచార్జ్ పుల్లారెడ్డి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి కృష్ణచైతన్య, జిల్లా ఉపాధ్యక్షులు చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి, బుచ్చి మున్సిపల్ వైస్‌చైర్మన్ మోర్ల సుప్రజ తదితరులు పాల్గొన్నారు.

## విజయ డెయిరీ

# రైతులకు శుభవార్త!



నెల్లూరు జిల్లాలోని విజయ డెయిరి పాడిరైతులకు డెయిరీ పాలక మండలి వారు శుభవార్త అందించారు. డెయిరీకి సంబంధించిన పాడిరైతులకు ప్రయోజనకరంగా ఉండే విధంగా జులై 1వ తేదీ నుండి లీటర్ పాలుకు ఒకటిన్నర రూపాయి ధర పెంచుతూ పాలకమండలి నిర్ణయం తీసుకుందని డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి జులై 1న ఒక ప్రకటనలో తెలిపారు. అందుకనుగుణంగా, జులై7 నుంచి పెంచిన పాల ధర అమల్లోకి వస్తుందని, ప్రతి పాడిరైతు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## మురిపించిన

# 'బాల వైద్యుడు'



జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా ఇటీవల నెల్లూరులోని సెయింట్ జోసెఫ్ స్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో ఒకటవ తరగతి చదువుతున్న విద్యార్థి ధ్రువకుమార్‌రాజ్ డాక్టర్ దుస్తులతో 'బాల వైద్యునిలా' వేదికపైకి వచ్చి, వైద్యులు ప్రజలకు, పేదరోగులకు అందిస్తున్న సేవలను అద్భుతంగా వివరించి అందరి కరతాళధ్వనులందుకున్నాడు. బీపీ అంటే ఏమిటి?..షుగర్ అంటే ఏమిటి?..అనే విషయాలను కూడా బాగా తెలియజెప్పు అందరినీ ఆకట్టుకున్నాడు. సమాజంలో వైద్యుల పాత్ర ఎంత గొప్పదో ముచ్చటైన మాటలతో వివరించిన ధ్రువకుమార్‌ను పాఠశాల ఉపాధ్యాయులు మెచ్చుకున్నారు.

# జడ్పీలో ఇద్దరికి కారుణ్య నియామకాలు



నెల్లూరుజిల్లా పరిషత్ సంస్థలో పనిచేస్తూ ఇటీవల మరణించిన ఇద్దరు ఉద్యోగుల వారసులకు జూన్ 30న జడ్పీలో కారుణ్య నియామకాలు చేసి, వారికి ఉద్యోగాలిచ్చారు. ఇందులో భాగంగా జ్యోతి కొండలరావుకి ఆఫీస్ సబార్డినేట్‌గా ఏఎస్‌పేట ఎంపీడీఓ కార్యాలయంలో, చైతన్య ప్రకాష్‌కి ఆఫీస్ సబార్డినేట్‌గా జిల్లా పరిషత్ కార్యాలయంలో నియమించారు. జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, ఇన్‌చార్జి సీఈఓ మోహన్‌రావు వారికి నియామకపత్రాలను అందజేశారు. జడ్పీ పరిపాలన అధికారులు వేల్పుల కొండయ్య, సుబ్రహ్మణ్యం, బీమిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా 'వైద్యరత్న' అవార్డులు



ప్రపంచ వైద్యుల దినోత్సవం సందర్భంగా మంగళవారం హైదరాబాద్‌లో నెల్లూరులోని పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్, ఎస్.ఆర్.ఆర్.చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో ఉత్తమ సేవలందిస్తున్న పలువురు వైద్యులను ఘనంగా సన్మానించి 'వైద్యరత్న' పేరుతో అవార్డులను బహుకరించారు. తెలంగాణ రాష్ట్ర శాసనమండలి ప్రతిపక్ష నేత ముఖ్య అతిథులు సిరికొండ మధుసూదనాచారి, డాక్టర్ గూడూరు సీతా మహాలక్ష్మి మాట్లాడుతూ, వైద్యులను అందరూ గౌరవించాలని కోరారు. అనంతరం "వైద్య రత్న" అవార్డులను వైద్యులకు బహుకరించారు. పురస్కారాలు అందుకున్నవారిలో డాక్టర్ జె.ప్రదీప్ కుమార్, డాక్టర్ షరీఫ్ ఖాన్ షా, డాక్టర్ కొండపల్లి అపర్ణ, డాక్టర్ నవీన్‌సింగ్ ఠాకూర్ తదితరులున్నారు. ఈ కార్యక్రమంలో లయన్ డాక్టర్ ఎస్.పి. భారతి, విశ్రాంత డిప్యూటి రిజిస్ట్రార్ ఎన్.వేణుగోపాల శర్మ, న్యాయవాది డా.అంజయ్య, రచయిత్రి డాక్టర్ రాధ కుసుమ, నిర్వాహకులు లయన్ డాక్టర్ ఎస్.రామచంద్ర రావు, పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ నిర్వాహకుడు కె.మురళీమోహన్ రాజు, డాక్టర్ బి.గంగాధర్ రెడ్డి, వి.వి.మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# నెల్లూరు కబుర్లు

## చిల్డ్రన్స్ పార్కు రూపురేఖలు మారుస్తా

### మంత్రి నారాయణ



నెల్లూరులోని చిల్డ్రన్స్ పార్క్‌ను మరింతగా అభివృద్ధి చేస్తామని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ చెప్పారు. ఈనెల 1న చిల్డ్రన్స్ పార్క్ అభివృద్ధి కమిటీ ఆహ్వానం మేరకు రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, మున్సిపల్ కమిషనర్ నందన్‌లతో కలిసి మంత్రి చిల్డ్రన్ పార్క్‌ను పరిశీలించారు. పార్క్ మొత్తం కలియతిరిగి అక్కడ ఉన్న పాదచారులు, చిన్నారులతో మాట్లాడారు. మంత్రి నారాయణ మాట్లాడుతూ చిల్డ్రన్స్ పార్కుకు కావలసిన వసతుల గురించి పరిశీలించామని, 14 ఎకరాల్లో విస్తరించి ఉన్న చిల్డ్రన్స్ పార్క్‌ను మరింతగా అభివృద్ధి చేసేందుకు కన్సల్టెంట్‌ను నియమిస్తామన్నారు. వారి సూచనలు, సలహాల మేరకు అందరితో చర్చించి పార్కును అభివృద్ధి చేసి ప్రజలకు మరింత ఆహ్లాదాన్ని అందిస్తామన్నారు. చిల్డ్రన్స్ పార్కును స్వయంగా అభివృద్ధి చేసేందుకు ముందుకు వచ్చిన వర్ల్యుసా గ్రూపును మంత్రి అభినందించారు. కన్సల్టెన్సీ నివేదిక అందిన వెంటనే వర్ల్యుసా గ్రూప్, పార్కు అభివృద్ధి కమిటీ, మున్సిపల్ కార్పొరేషన్ అందరితో చర్చించి అందరికీ ఆమోదయోగ్యమైన రీతిలో జిల్లాకే తలమానికంగా ది బెస్ట్ పార్కుగా చిల్డ్రన్స్ పార్క్‌ను అభివృద్ధి చేస్తామన్నారు.

## దివ్యాంగురాలిని ఆదుకున్న కలెక్టర్



నెల్లూరు, పొదలకూరురోడ్డు గౌతమి నగర్ రెండో వీధిలో అనారోగ్యంతో ఉన్న మానసిక దివ్యాంగురాలికి జిల్లా కలెక్టర్ ఆనంద్ ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్‌ను అందించారు. మంగళవారం ఉదయం ఆయన చిన్నారి భానుశ్రీ ఇంటికి వెళ్ళి రూ.15వేలు పింఛను అందించారు. భానుశ్రీ తల్లి కామాక్షమ్మతో మాట్లాడి చిన్నారి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. వెంకటాచలంలోని సిఆర్‌సి కేంద్రానికి తీసుకెళ్లి మెరుగైన చికిత్స అందించాలని, ఇందుకు ప్రభుత్వపరంగా సహకారం అందిస్తామని కలెక్టర్ భరోసా ఇచ్చారు. ఆ చిన్నారిని సమీపంలోని భవిత కేంద్రంలో చేర్పించి విద్యాబుద్ధులు నేర్పించాలని సూచించారు. కలెక్టర్ ఆనంద్ నేరుగా తమ ఇంటికి వచ్చి పింఛను అందించడం పట్ల భానుశ్రీ కుటుంబసభ్యులు తమ ధన్యవాదాలు తెలిపారు. సచివాలయ సిబ్బంది విజయ్, జాస్మిన్, స్వాతి, శోభ పాల్గొన్నారు.



### బీఎస్ఎన్ఎల్ సేవలను

## సద్వినియోగం చేసుకోవాలి

### ప్రజలకు ఎంపీ వేమిరెడ్డి పిలుపు

బిఎస్ఎన్ఎల్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా టెలికం అడ్వైజరీ కమిటీ ఛైర్మన్, నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కోరారు. ఆ సంస్థ బలోపేతానికి అందరు కలిసి పని చేయాలని ఆయన పిలుపునిచ్చారు. జులై 1న నెల్లూరులోని బిఎస్ఎన్ఎల్ కార్యాలయంలో టెలికం అడ్వైజరీ కమిటీ(టీఏసీ) 2వ సమావేశం ఎంపీ వేమిరెడ్డి అధ్యక్షతన, సంస్థ నెల్లూరు ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్ అమరేంద్ర రెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. జిల్లాలో బిఎస్ఎన్ఎల్ అందిస్తున్న సేవలు, ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై వారు సమావేశంలో చర్చించారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, 17 సంవత్సరాల తర్వాత ఈ సంస్థ 2024-25 ఆర్థిక సంవత్సరంలో అక్టోబరు-డిసెంబరులో రూ.262కోట్లు, అలాగే జనవరి-మార్చి కాలానికి రూ.280కోట్ల లాభాలు సాధించినట్లు వివరించారు. అంతకుముందు ఏడాది ఇదే సమయంలో రూ.1569 కోట్ల నష్టం వచ్చిందన్నారు. లాభాలు సంస్థ అభివృద్ధికి నిదర్శనమన్నారు. ఇటీవల కొత్తగా 35 టవర్లు కూడా వచ్చాయని వివరించారు. టెలికం అడ్వైజరీ కమిటీ సభ్యులు ఆయా నియోజకవర్గాల్లో ఉన్న ఇబ్బందులను సభ దృష్టికి తెచ్చారని, అధికారులు వాటిపై దృష్టి పెట్టి పరిష్కారం చూపుతారన్నారు. సంస్థ అభివృద్ధికి టీఏసీ సభ్యులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. బిఎస్ఎన్ఎల్ అభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు అందిస్తానన్నారు. టీఏసీ సభ్యులు కటారి రమణయ్య, గుర్రం మాల్యాద్రి, ప్రసాద్, బ్రహ్మానందం, రమేష్‌బాబు, ముంగర గోపాల్, అనూష, సురేంద్రరెడ్డి, డిజిఎం ఎం.శ్రీనివాసరావు, ఐఎఫ్ఏ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

### శ్రీ షిరిడీ సాయిబాబా మందిరంలో..

## గురుపూర్ణిమ ఉత్సవాలు



గురుపూర్ణిమను పురస్కరించుకుని నెల్లూరు గాంధీనగర్ ట్రంకురోడ్డు వద్ద నుంచి శ్రీ షిరిడీ సాయిబాబా మందిరంలో అత్యంత వైభవంగా ఉత్సవాలను నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా 10 నుంచి 16వ తేదీ వరకు ప్రతిరోజూ ఉదయం 7 నుంచి బాబావారికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, మధ్యాహ్నం 12 నుంచి సామూహిక అష్టోత్తర సహస్ర నామ పూజలు జరుగనున్నాయి. 16వ తేదీ సాయంత్రం 6 గంటలకు పుష్పాలంకరణలతో, బాణసంచా వేడుకలతో బాబావారి నగరోత్సవం మరింత కన్నులపండువగా ఉంటుందని, బాబా భక్తులందరూ వచ్చి, ఆ స్వామిని దర్శించుకుని తరించాలని సాయిబాబా మందిరం కమిటీవారు తెలిపారు.

## ఇంటింటికీ శ్రీధర్‌రెడ్డి!



నిత్యం ప్రజల్లో ఉంటూ వారి సాధకబాధకాలు తెలుసుకుంటూ, వారి సంక్షేమానికి పాటుపడుతున్న నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఈనెల 1న తమ కూటమి ప్రభుత్వ సుపరిపాలనపై 'తొలి అడుగు' కార్యక్రమాన్ని నిర్వహించారు. నియోజకవర్గంలోని 35వ డివిజన్ లేక్‌వ్యూ కాలనీ 6వ వీధి నుంచి ఆయన ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇంటింటికీ తిరుగుతూ ప్రజల యోగక్షేమాలు విచారించి, వారికి తనవంతు చేయూతనందిస్తున్నారు. ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా లేదా అంటూ ఆరాతీశారు. పలువురు వృద్ధులను పరామర్శించి, వారి ఆరోగ్య స్థితిగతులు తెలుసుకున్నారు. ఈ సంవత్సర కాలంలో తెలుగుదేశం పార్టీ కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి మరియు సంక్షేమ కార్యక్రమాలను ఆయన ఈ సందర్భంగా ప్రజలకు వివరించారు.

## కార్పొరేషన్‌లో ఆకస్మిక తనిఖీ



నెల్లూరు నగర పాలక సంస్థలోని పలువిభాగాలను కార్పొరేషన్ కమిషనర్ వై.నందన్ జూన్ 30న ఆకస్మికంగా సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఆయా విభాగాల అధికారులతో మాట్లాడి, సిబ్బంది పనితీరును ఆరా తీశారు. ప్రజల సమస్యలకు ఎప్పటికప్పుడు స్పందించి, వారికి మెరుగైన సేవలందించాలని, ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందుకున్న అర్జీలను పరిశీలించి, బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. వచ్చిన అర్జీలను మళ్ళీ రాకుండా ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించాలని చెప్పారు.

## దివ్యాంగులకు ల్యాప్‌టాప్‌లు



జిల్లాలోని 11 మంది దివ్యాంగులకు జూన్ 30న జిల్లా జాయింట్ కలెక్టర్ కార్తీక్ ల్యాప్‌టాప్‌లు అందజేశారు. ఒక్కో ల్యాప్‌టాప్ ఖరీదు రూ. 42 వేల దాకా ఉంటుంది. మొత్తం 4.62 లక్షల రూపాయల విలువైన ఆ ల్యాప్‌టాప్‌లను విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో, దివ్యాంగులకు పంపిణీ చేశారు. డిఆర్ఓ ఉదయ భాస్కర్‌రావు, కలెక్టరేట్ పరిపాలనాధికారి విజయకుమార్, అసిస్టెంట్ డైరెక్టర్ మహమ్మద్ అయూబ్, సూపరింటెండెంట్ సంధ్యారాణి పాల్గొన్నారు.




### 6న.. నగరంలో

## జేవీవీ మహాసభలు

జన విజ్ఞాన వేదిక(జేవీవీ) నెల్లూరు జిల్లా శాఖ 18వ మహాసభలు జులై 6వ తేదీన జరుగనున్నాయి. స్థానిక మద్రాసుబస్టాండ్ వద్ద ఉన్న రెడ్‌క్రాస్ ప్రాంగణంలోని బ్లడ్‌బ్యాంక్‌లో జరుగనున్నాయి. ప్రజల కోసం సైన్స్ అనే నినాదంతో జేవీవీ రాష్ట్రవ్యాప్తంగా ఎన్నో కార్యక్రమాలు ఏర్పాటు చేసి ప్రజలను చైతన్యవంతం చేస్తున్న విషయం తెలిసిందే. గత రెండేళ్ల కార్యక్రమాలు సమీక్షించుకుని, భవిష్యత్ కార్యక్రమాల రూపకల్పన కోసం ఈ మహాసభలు నిర్వహించనున్నామని, జేవీవీ నాయకులు, కార్యకర్తలు, కళాకారులు అందరూ పాల్గొని జయప్రదం చేయాలని జేవీవీ అధ్యక్ష కార్యదర్శులు డా.వి.వేణుగోపాల్, వి.చక్రపాణి ఒక ప్రకటనలో కోరారు.

### వేతనాలు పెంచాలంటూ

## సీఐటీయు డిమాండ్

నెల్లూరు కార్పొరేషన్‌లో పనిచేస్తున్న ఇంజనీరింగ్ విభాగంలోని కార్మికులకు వేతనాలు పెంచాలని సీఐటీయు నాయకులు డిమాండ్ చేశారు. ఈనెల 1న కార్పొరేషన్ ఎదుట నాయకులు కత్తి శ్రీనివాసులు, మోహన్‌బాబు, ఎం.శ్రీనివాసులు తదితరులు మాట్లాడుతూ, కార్పొరేషన్ ఇంజనీరింగ్ విభాగంలోని కార్మికుల పాత్ర ఎంతో కీలకమైందని, మంచినీటి సరఫరా, వీధిలైట్లు, డ్రైనేజీ విభాగాల్లో పనిచేస్తున్న వారికి వేతనాలు పెంచాలని కోరారు. ప్రస్తుతం విధి విధానాల ప్రకారం వీరికి కనీసం వేతనం 20వేలు ఇవ్వాల్సి ఉండగా, కేవలం 13వేలు మాత్రమే ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నైపుణ్యం కలిగిన కార్మికులకు ఎక్కువ జీతాలివ్వాలన్నారు. ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాలను వీరికి కూడా వర్తింపజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పెంచలనరసయ్య, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# మాట నిలబెట్టుకుంటున్న కూటమి ప్రభుత్వం

- పింఛన్లు పంపిణీ చేసిన.. మంత్రి నారాయణ, ఎంపీ వేమిరెడ్డి



పింఛను పెంచి లబ్ధిదారులకు మరింతగా ఆదుకుంటామని ఎన్నికలప్పుడు కూటమి నేతలు చెప్పిన మాటలు నేడు ఆచరణలోకి వచ్చాయని, మాట నిలబెట్టుకుంటున్న ప్రభుత్వంగా టీడీపీ కూటమి ప్రభుత్వం ప్రజల ఆదరాభిమానాలు పొందుతోందని నెల్లూరు నేతలు చెప్పారు. ఈనెల 1న నెల్లూరు నగరంలోని 42వ డివిజన్ మన్సూర్‌నగర్లో జరిగిన ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి నారాయణ, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు. లబ్ధిదారుల ఇంటి వద్దకు వెళ్లి పింఛన్లు అందించి, వారి యోగ క్షేమాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ, రాష్ట్రంలో ప్రతినెలా ఒకటో తేదీన పింఛన్ల పండుగరోజని, ఆ రోజున ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా 68 లక్షల మందికి ప్రభుత్వం పింఛన్లు అందజేస్తోందని చెప్పారు. ఒకటో తారీఖునే 99 శాతం పింఛన్లను పంపిణీ చేస్తున్నామన్నారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం పింఛన్లు పెంచి వృద్ధులకు రూ.4వేలు, వికలాంగులకు రూ.6వేలు, మంచానికి పరిమితమైన వికలాంగులకు రూ.15వేలు వంతున అందిస్తున్నామన్నారు. పింఛను పొందుతున్న లబ్ధిదారుల కళ్ళలో ఆనందం చూస్తే సంతోషంగా ఉందన్నారు. భారత దేశంలో ఎక్కడా కూడా పింఛన్లకు ఇంత పెద్దమొత్తం చెల్లించడం లేదన్నారు. జూన్ 12 నుంచి 'తల్లికి వందనం' అమలు చేస్తున్నామని, త్వరలోనే రైతులకు సాయంగా రూ. 20 వేలు అందిస్తామన్నారు. ఆగస్ట్ నుంచి మహిళలకు ఉచిత బస్సుప్రయాణం అమలు చేయడం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో ఖజానా ఖాళీగా వున్నప్పటికీ ముఖ్యమంత్రి అపార అనుభవంతో రాష్ట్ర అభివృద్ధితో పాటు సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ హామీలను నెరవేరుస్తున్నారన్నారు.

## చరిత్ర సృష్టించారు - వేమిరెడ్డి

ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ, పింఛన్ల పంపిణీలో ముఖ్యమంత్రి చరిత్ర సృష్టించారని కొనియాడారు. నెల్లూరుజిల్లాలో 3.40లక్షల మంది పింఛన్ల లబ్ధిదారులు ఉన్నారన్నారు. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నా ముఖ్యమంత్రి ఇచ్చిన మాటప్రకారం పింఛన్లు పెంచి ఇస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం చేస్తున్న మంచిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఈ సందర్భంగా ఆయన కార్యకర్తలకు సూచించారు. రాత్రి, పగలు తేడా లేకుండా మంత్రి నారాయణ అభివృద్ధికి కృషిచేస్తున్నారని చెప్పారు. ఇటువంటి మంత్రి మనకి ఉండటం నెల్లూరు ప్రజల అదృష్టమని ఎంపీ ప్రశంసించారు.

# దేవిరెడ్డి శారద ట్రస్టు సేవలు అభినందనీయం

- కొనియాడిన పురపాలక మంత్రి నారాయణ



దేవిరెడ్డి శారద చారిటబుల్ ట్రస్టు సేవలు అభినందనీయమని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ ప్రశంసించారు. సోమవారం ఆయన అల్లూరు మండలం, నార్త్‌మోపూరులోని డిఎస్ఆర్ ట్రస్టు ప్రాంగణంలోని హైస్కూల్, ఆసుపత్రి, స్కిల్ డెవలప్‌మెంటు సెంటర్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దేవిరెడ్డి శారదా ట్రస్టు నిర్వాహకులు దేవిరెడ్డి సుధాకర్‌రెడ్డి, దశరథ రామిరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి పేదలకు విద్య, వైద్యం చేరువ చేయడంలో విశేషంగా కృషి చేస్తున్నారన్నారు. డిఎస్ఆర్ ట్రస్టు ద్వారా అల్లూరు మండలంలోని పేద విద్యార్థులకు ఉచితంగా విద్యను అందిస్తున్నారని, వారికి వసతి సౌకర్యం కూడా కల్పిస్తున్నారన్నారు. ఇక్కడ సుమారు 400 నుంచి 500మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని, కంప్యూటర్ ల్యాబ్స్, తరగతి గదులు చాలా బాగున్నాయని మంత్రి కితాబిచ్చారు. ఇదే తరహాలో నెల్లూరు నగరంలోని 54 మున్సిపల్ పాఠశాలలను అభివృద్ధి చేయాలనే లక్ష్యంతోనే డిఎస్ఆర్ ట్రస్టును సందర్శించినట్లు తెలిపారు.

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పిలుపుమేరకు పి-4లో భాగంగా మూలాపేట బాలికల హైస్కూల్‌ను దత్తత తీసుకొని అభివృద్ధి చేసేందుకు ముందుకొచ్చిన దేవిరెడ్డి సుధాకర్ రెడ్డికి మంత్రి నారాయణ ఈ సందర్బంగా ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తొలుత డిఎస్ఆర్ ట్రస్టు ప్రాంగణంలోని స్వర్గీయ దేవిరెడ్డి శారద విగ్రహానికి మంత్రి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో డిఎస్ఆర్ ట్రస్టు నిర్వాహకులు దేవిరెడ్డి సుధాకర్‌రెడ్డి, దశరథరామిరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, ట్రస్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వైకాపాని నిర్వీర్యం చేయాలనే టీడీపీ కుట్ర!

- నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి విమర్శ



వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీని పూర్తి స్థాయిలో నిర్వీర్యం చేయాలన్న కుట్రలతో చంద్రబాబు సర్కార్ రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని వైకాపా వెంకటగిరి నియోజకవర్గం సమన్వయ కర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. ఇటీవల ఆయన వెంకటగిరిలోని తమ నివాసంలో వైకాపా కార్యకర్తలు, నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రామ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ, చంద్రబాబు ఏడాది పాలనలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా, ప్రజలను మభ్యపెట్టడాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. జూలై 8వ తేదీన వెంకటగిరిలో ఆమేరకు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల ముందు కూటమి నాయకులు అనేక హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా హామీలను సక్రమంగా అమలు చేయక పోవడంతో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఈ సందర్భంగా విమర్శించారు.

# పరిశ్రమల్లో జీఎస్టీది కీలకపాత్ర

- శ్రీసిటీ ఎం.డీ డా.రవీంద్ర సన్నారెడ్డి




తిరుపతిలోని సెంట్రల్ గూడ్స్ అండ్ సర్వీసెస్ ట్యాక్స్ (సిజిఎస్‌టి) కమిషనరేట్ పరిధిలో వస్తు సేవల పన్ను (జిఎస్‌టి) 8వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని జులై 1న తిరుపతి కార్యాలయ ఆవరణలో 'సరళీకృత పన్నులు, పౌరుల సాధికారత' అనే అంశంపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా చేపట్టిన అవార్డుల కార్యక్రమంలో పన్నుల చెల్లింపులలో అగ్రశ్రేణి సంస్థలుగా గుర్తించిన ఏడుగురిలో శ్రీసిటీలోని ఇసుజు మోటార్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమకు అవార్డు లభించడం విశేషం. ఈ కార్యక్రమంలో శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. తిరుపతి సీజీఎస్టీ కమిషనరేట్ అదనపు కమిషనర్ ఆర్.దినకరన్ సమక్షంలో గుంటూరు సీజీఎస్టీ ఆడిట్ కమిషనర్ పి.ఆనంద్‌కుమార్ తదితరులు పాల్గొని, ఎంపిక చేసిన సంస్థలకు అవార్డులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ శ్రీసిటీ తరహా పారిశ్రామిక కేంద్రాలలో జీఎస్టీ కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు. శ్రీసిటీ సంస్థకు అవార్డు రావడం శ్రీసిటీ స్థిరమైన అభివృద్ధి కేంద్రీకృత పర్యావరణ వ్యవస్థకు అద్దం పడుతుందన్నారు. తిరుపతి కమిషనరేట్ పనితీరును ఆయన ఈ సందర్భంగా ప్రశంసించారు.

# జడ్పీ ఏఓ..కొండయ్యకి వీడ్కోలు



నెల్లూరుజిల్లా పరిషత్‌లో పరిపాలనాధికారి(ఏఓ)గా 39ఏళ్ళ పాటు పనిచేసి, జూన్ 30న ఉద్యోగ విరమణ చేసిన వేల్పుల కొండయ్యని అధికారులు, ఉద్యోగులు ఘనంగా సన్మానించి వీడ్కోలు తెలిపారు. జడ్పీ సమావేశ మందిరంలో జరిగిన ఈ కార్యక్రమంలో జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, సీఇఓ మోహన్‌రావు పాల్గొని కొండయ్య దంపతులను గజమాలతో సత్కరించారు. కొండయ్య ఎంతో క్రమశిక్షణతో పనిచేసి, వృత్తికే వన్నె తెచ్చారని అరుణమ్మ కొనియాడారు. ఉత్తమ ఉద్యోగిగా పలుసార్లు అవార్డులు కూడా అందుకున్నారని, వారి సేవలు అందరికీ మార్గదర్శకం కావాలని ఆకాంక్షించారు.

# డెంగ్యూపై అవగాహన ర్యాలీ



డెంగ్యూ మాసోత్సవాలను పురస్కరించుకుని నెల్లూరు జులై 1న జిల్లా వైద్యఆరోగ్యశాఖ వారి ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక వైద్యారోగ్య శాఖ కార్యాలయం నుంచి గుప్తాపార్కు వరకు ర్యాలీ చేపట్టారు. దోమలు వ్యాప్తి చెందకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని దోమలు పెరగకుండా జాగ్రత్తలు వహించాలని డీఎంఅండ్‌హెచ్ఓ సుజాత పిలుపునిచ్చారు. మలేరియా అధికారి హుస్సేనమ్మ, సహాయ అధికారి నాగార్జున రావు, డాక్టర్ ఖాదర్‌వలీ తదితరులు పాల్గొన్నారు







## ఉపాధి బకాయిలివ్వాలంటూ ధర్నా

ఉపాధి హామీ కూలీల బకాయిలు చెల్లించాలని కోరుతూ జిల్లా వ్యవసాయ కార్మికసంఘం ఆధ్వర్యంలో జూన్ 30న నెల్లూరు కలెక్టరేట్ వద్ద ధర్నా జరిగింది. పేదలకు ఆసరాగా ప్రభుత్వం కల్పిస్తున్న ఉపాధి పనులను జిల్లాలో సక్రమంగా నిర్వహించడం లేదని, గ్రామాల్లో 40 శాతం పనులు కూడా చేయించడం లేదని, చేసిన పనికి ఇవ్వాల్సిన కూలీ డబ్బును నెలల తరబడిగా ఇవ్వకపోవడం దారుణమని నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. ఆ సంఘం జిల్లా నేతలు వెంకమ రాజు, ప్రధాన కార్యదర్శి పుల్లయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## రోడ్డెక్కిన పొగాకు రైతులు

తాము కష్టించి పండించిన పొగాకు పంటకు కొనుగోలు దారుల గుత్తాధిపత్యం వల్ల గిట్టుబాటు ధరలు లేకపోవడం, లోగ్రేడ్ పొగాకు కొనుగోళ్లు జరగకపోతుండడంతో కందుకూరులో పొగాకు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తూ రోడ్డెక్కారు. ఇటీవల కందుకూరు మండలంలోని పలు గ్రామాల్లో జరిగిన పొగాకు వేలంలో కొనుగోలుదారులు అధికశాతం పొగాకు బేళ్లను కొనుగోలు చేయకపోవడంతో పొగాకు బోర్డు నిర్వాహకులు వేలం నిలుపుదల చేశారు. దీంతో రైతులు ర్యాలీగా సబ్ కలెక్టర్ శ్రీపూజ వద్దకు వెళ్ళి తమ గోడు వినిపించి, వినతిపత్రం అందజేశారు. గిట్టుబాటు ధరలు ఇచ్చేదాకా కొనుగోళ్ళు నిర్వహించేది లేదని రైతులు ఆగ్రహం వ్యక్తంచేస్తూ, రోడ్డుకు ట్రాక్టర్లను అడ్డంగాపెట్టి ఆందోళన చేశారు. తమ సమస్యలు తీర్చి న్యాయం చేయాలంటూ నినాదాలు చేశారు. పోలీసులు, రీజనల్ మేనేజర్ లక్ష్మణరావు రైతులకు నచ్చజెప్పి శాంతింపజేసి, తిరిగి కొనుగోళ్లను ప్రారంభింపజేశారు.

## పంచాయతి కార్యదర్శుల నిరసనలు

పనిభారం తగ్గించాలని, ఏ శాఖలో లేని విధంగా ఐవీ ఆర్ఎస్ కాల్స్‌ను పంచాయతీశాఖలో ప్రవేశపెట్టడం వల్ల పని వత్తిడి మరింతగా పెరిగిపోతోందని పంచాయతీ కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ పంచాయతీల్లో అన్నిరకాల సర్వేలు, పంచాయతీ పనులు, ఇంటిపన్నుల వసూళ్ళు, పిఈర్ వన్ యాప్, గ్రామ సచివాలయ సర్వేలు, గ్రామ సభలు, గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన, పారి శుద్ధ్యం పర్యవేక్షణ తదితర అన్నిపనులను పంచాయతీ కార్యదర్శులే చేయాల్సి వస్తోందని, అందువల్ల పనిభారం పెరిగి తామెన్నో బాధలు పడుతున్నామంటూ ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల వారు నెల్లూరులోని జిల్లా పంచయతీ కార్యాలయం వద్ద, కలెక్టరేట్ వద్ద నిరసన ప్రదర్శనలు చేశారు. విధి నిర్వహణలో విపరీతమైన పని వత్తిడి వల్ల మానసికంగా ఆందోళనకు గురవుతున్నామని, ప్రభుత్వం పనివత్తిడిని తగ్గించాలని కోరారు. ఆమేరకు కలెక్టర్ కార్యాలయంలో డిఆర్ఓకి పంచాయతిరాజ్ ఫెడరేషన్ నాయకులు వినతిపత్రం అందజేశారు.

## కోవూరులో విధుల బహిష్కరణ :

ప్రభుత్వం తమపై అదనపు పనిభారం మోపుతుందని నిరసన వ్యక్తం చేస్తూ, కోవూరు మండలంలోని గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న పంచాయతి కార్యదర్శులు ఇటీవల విధులు బహిష్కరించారు. ఈ సందర్భంగా కోవూరు ఎంపీడీఓ శ్రీహరి రెడ్డికి తమ సమస్యలు విన్నవిస్తూ వినతిపత్రం సమర్పించారు.

## దళిత సంఘర్షణ సమితి ఆందోళన

యానాదులున్న కాలనీల్లో ప్రాథమిక పాఠశాలలను ఎత్తివేయడం అన్యాయమంటూ దళిత సంఘర్షణ సమితి ఆధ్వర్యంలో జూన్30న ఆందోళన నిర్వహించారు. ఆ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్. మల్లి మాట్లాడుతూ బోగోలు మండలం కొండబిట్రగుంట యానాదికాలనీలో 48 మంది విద్యార్థులున్న పాఠశాలను, పొరుగున ఉన్న గ్రామంలో విలీనం చేయడం వల్ల విద్యార్థులు అక్కడికి వెళ్ళి చదువుకోవడం కష్టంగా ఉందన్నారు. అనంతరం, కలెక్టరేట్‌లోని అధికారులకు వినతి పత్రం అందజేశారు.



## 'ఉపాధి హామీ' మస్టర్లు మాయం!

ఉదయగిరి మండలంలోని పుల్లాయపల్లి గ్రామంలో ఉపాధి హామీ పథకానికి సంబంధించిన మస్టర్లు మాయం కావడంతో గ్రామస్తులు గగ్గోలు పెడుతున్నారు. ఎండనక, వాననక తాము కష్టపడి పనిచేస్తుంటే తమ పనుల వివరాలకు సంబంధించిన మస్టర్లను కావాలనే ఎవరో గల్లంతు చేశారంటూ జూన్ 30న ఉదయగిరి ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఆందోళనకు దిగారు. ఎంపీడీఓ అప్పాజీతో తమ గోడు వెళ్ళబోసుకున్నారు. గతంలో కూడా ఇలాగే మస్టర్లు మాయమైపోయాయని, సిబ్బందిలో ఎవరో ఈ దుశ్చర్యలకు పాల్పడుతున్నారని వారు మండిపడ్డారు. జిల్లాస్థాయి అధికారులు పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, తాము పనిచేసిన పనిదినాలకు సంబంధించిన డబ్బును ఇప్పించాలని వారు కోరుతున్నారు.

## అంకాళమ్మ తల్లికి.. తిరునాళ్ళ శోభ



వరికుంటపాడు మండలం పెద్దిరెడ్డిపాళెం గ్రామంలో వెలసి వున్న గ్రామశక్తి.. శ్రీ అంకాళమ్మ తల్లికి ఇటీవల పెద్దఎత్తున తిరునాళ్ల జరిగింది. ప్రత్యేక పూజలు, అలంకరణలతో అమ్మవారి గుడి అంతా కోలాహలంగా మారింది. భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. సకాలంలో వానలు కురిసి తమ ఊళ్లు పాడిపంటలతో కళకళలాడాలని అమ్మవారికి మొక్కుకున్నారు. ఈ సందర్భంగా, సోమవారం రాత్రి సింహవాహనంపై అంకాళమ్మతల్లికి వేడుకగా గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీసభ్యుల పర్యవేక్షణలో ఆలయ ప్రాంతాన్నంతా విద్యుద్దీపాలంకరణలతో శోభాయమానం చేశారు.

## నెలాఖరుదాకా డెంగ్యూ మాసోత్సవాలు



జులై 1 నుంచి 31వ తేదీ వరకు డెంగ్యూ మాసోత్సవాల సందర్భంగా ఆ వ్యాధి నివారణకు ప్రజల్లో చైతన్యం కలిగించేందుకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖవారు సమాయత్తమయ్యారు. ఆమేరకు జులై 30న నెల్లూరులోని డీఎంఅండ్‌హెచ్ఓ కార్యాలయంలో జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ వి.సుజాత డెంగ్యూ పోస్టర్లను, బ్యానర్లను ఆవిష్కరించారు. జిల్లాలోని ఆరోగ్యకేంద్రాల్లో, ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న వైద్యులు ఆయా ప్రాంతాల్లో ప్రజలు డెంగ్యూ వ్యాధికి, ఇతరత్రా సీజనల్ వ్యాధులకు గురికాకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీఎంఅండ్‌హెచ్ఓ ఎస్‌కె ఖాదర్ వలీ, జిల్లా మలేరియా అధికారిణి హుస్సేనమ్మ, నాగార్జునరావు, ఎన్ఆర్‌హెచ్ ఎంపీఓ డాక్టర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## యానాదుల పిల్లలను కాపాడండి

### జిల్లా సంఘం నాయకుని అభ్యర్థన

రాష్ట్రంలో అనేకచోట్ల నిరుపేద గిరిజన, యానాదుల కుటుంబాలకు చెందిన పిల్లలను గుర్తు తెలియని వ్యక్తులెవరో కిడ్నాప్‌చేసి, దూరప్రాంతాల్లో ఇళ్ళు, హోటళ్ళలో వెట్టిచాకిరీ చేయిస్తున్నారంటూ అఖిలభారత యానాది మహానాడు జిల్లా సంఘం అధ్యక్షుడు చౌటూరు శీనయ్య ఆవేదన వ్యక్తం చేశారు. జూన్ 30న నెల్లూరు ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకర్ల సమావేశం పెట్టి, తమ గోడు వినిపించారు. జిల్లాలోని పలు ఆలయాల వద్ద, బీచ్‌లు తదితర ప్రాంతాల్లో ఉన్న యానాదుల పిల్లలు తరచూ మాయమవుతున్నారని తెలిపారు. తమ పిల్లల ఆచూకీ కనిపెట్టి, తమ పిల్లలను తమకు అప్పగించాలని కోరుతూ, ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా ఎవరూ పట్టించుకోకపోవడం దారుణమని ఆయన బాధను వ్యక్తం చేశారు. జిల్లా అధికారులు వెంటనే రంగంలోకి దిగి, యానాదుల పిల్లలను కాపాడాలని ఆయన కోరారు.

# గాలిలో దీపంగా.. పరిశ్రమల భద్రత




తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్ సమీపం లోని పాశమైలారంలోని సిగాచి ఔషధ పరిశ్రమలో జులై 30న పేలుడు జరిగి దాదాపు 40 మంది ప్రాణాలు కోల్పోయిన నేపథ్యంలో పరిశ్రమల్లో భద్రత, సురక్షిత పనివాతావరణం గాల్లో దీపమేనని మరోసారి రుజువయింది. గత ఏడాది ఆగస్టులో ఆంధ్రప్రదేశ్‌లోని అనకాపల్లి సమీపంలోని అచ్యుతాపురం ప్రత్యేక ఆర్థిక మండలిలోని ఎసెన్షియా పరిశ్రమలో పేలుడు జరిగి 17 మంది మరణించిన సంగతి అందరికీ గుర్తు ఉండే ఉంటుంది. ఆ ప్రమాదం తర్వాత జరిగిన పెద్ద ప్రమాదం సిగాచి పరిశ్రమలోని ప్రమాదమే. సిగాచిలో స్ప్రేయర్ డ్రయ్యర్ పేలడంతో ఈ ఘోర ప్రమాదం జరిగింది. పేలుడు ధాటికి పరిశ్రమ మొత్తం ధ్వంసమయింది. నేరుగా పేలుడు ధాటికి మరణించిన వారు కొందరయితే కుప్పకూలిన కాంక్రీట్ శిథిలాల్లో ఛిద్రమై మరణించిన వారు కొందరు. గాయపడిన వారిలో కొందరి పరిస్థితి ఇంకా విషమంగానే ఉందని వైద్యులు చెబుతున్నారు. ఇంకా కొంతమంది ఆచూకీ లభించలేదు. దీంతో ప్రాణనష్టం పెరిగే అవకాశముందని అంచనా వేస్తున్నారు. ఇంత పెద్ద ప్రమాదం జరిగిన తర్వాత ముఖ్యమంత్రి, మంత్రులు, అధికారులు వచ్చి సందర్శించి, వారు చేయాల్సిన పనులు వారు చేశారు. కానీ, పరిశ్రమ యాజమాన్యం నుంచి ఒక్కరు కూడా రాలేదు. ఒక ప్రకటనా వెలువడలేదు. ప్రమాదానికి కారణాలు, తప్పొప్పుల సంగతి అటుంచితే... జరిగిన ప్రమాదం పట్ల, తమ పరిశ్రమలోని ఉద్యోగులు మరణించడం పట్ల విచారం వ్యక్తం చేయడం కనీస బాధ్యత అన్న సంగతి కూడా యాజమాన్యం మరచిపోయినట్లుంది. కనీస మానవత్వాన్ని చూపలేకపోయింది. ప్రభుత్వం తన బాధ్యతగా బాధిత కుటుంబాలకు పరిహారం ప్రకటించింది. అంతవరకు సంతోషమే! కానీ, పోయిన ప్రాణాలకు విలువ కట్టగలమా? చనిపోయిన వారిలో త్వరలో పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్న రెండు జంటలున్నాయి. వారి కుటుంబాల కలలకు, తమ పిల్లలపై వారు పెట్టుకున్న ఆశలకు విలువ కట్టగలమా? సంపాదించే మనిషి అర్ధంతరంగా మరణిస్తే ఆ కుటుంబం పరిస్థితి అల్లకల్లోలమవుతుంది. ఆర్థికంగానే కాదు.. అనుబంధాల పరంగానూ ఎంతో నష్టపోతారు. ఆర్థిక పరిహారం అందించినా దాన్ని నిలబెట్టుకునే ప్రణాళిక, సన్నద్ధత ఆ కుటుంబం వద్ద ఉండకపోవచ్చు. ఎందుకంటే సాధారణంగా సగటు భారతీయ కుటుంబాల్లో సంపాదనపరుడైన కుటుంబపెద్దే భవిష్యత్తు ప్రణాళిక బాధ్యతలను కూడా మోస్తుంటాడు. మిగిలిన వారు మిగిలిన పనులను పంచుకుంటారే తప్ప ఆర్థిక ప్రణాళికలపై అంతగా పట్టు ఉండదు. ఇది వాస్తవికత.

ప్రమాదానికి కచ్చితంగా నిర్వహణ లోపమే కారణం. ఔషధ పరిశ్రమల్లో అగ్ని ప్రమాదానికి, పేలుడుకు ఆస్కారం ఎక్కువగా ఉండే రసాయనాలుంటాయి. అందుకే వాటి నిర్వహణకు కచ్చితమైన అంతర్జాతీయ ప్రమాణాలుంటాయి. నిర్దేశిత ప్రామాణిక నిర్వహణ ప్రక్రియలుంటాయి. ఏ ఒక్క ప్రమాణాన్ని ఏ ఒక్క రోజు పాటించకపోయినా జరిగే నష్టాన్ని అంచనా వేయలేము. ప్రమాణాన్ని పాటించని రోజున ప్రమాదం జరగకపోవచ్చు, కానీ దానివల్ల ఏదో ఒకరోజు ప్రమాదం జరిగి తీరుతుంది. అందుకే రసాయన, ఔషధ పరిశ్రమల్లో అనుక్షణం భద్రతప్రమాణాలను పాటించాల్సిందే. కానీ చాలా పరిశ్రమల్లో భద్రతా ఏర్పాట్లు, సురక్షిత పనివాతావరణం ఉండదు. నిర్వహణ వ్యయం తగ్గించుకోవడానికి చాలా పరిశ్రమల యాజమాన్యాలు ప్రామాణిక నిర్వహణ ప్రక్రియ పాటింపులో నిర్లక్ష్యం వహిస్తుంటాయి. అందుకు కావాల్సిన శిక్షణను సిబ్బందికి అందించవు. జీతభత్యాల ఆదా కోసం తగిన నైపుణ్యం, అర్హత లేనివారిని కూడా నియమించుకుంటుంటాయి. తనిఖీలు చేసి దారిలో పెట్టాల్సిన అధికారులు పరిశ్రమల యాజమాన్యాలు ఇచ్చే లంచాలకు అలవాటు పడి వదిలేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. పాశమైలారం సంఘటనలో ప్రమాదానికి కారణం అదయి ఉండవచ్చు, ఇదయి ఉండవచ్చు అని ఊహాగానాలతో సరిపెట్టవద్దని, స్పష్టమైన కారణాన్ని వెలికి తీసి, బాధ్యులెవరో తేల్చాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కరాఖండిగా చెప్పడం ద్వారా అధికారులకు స్పష్టమైన సందేశమిచ్చారు. అయితే ప్రమాదం జరిగిన తర్వాత లోపాలను కనుక్కుంటే ప్రయోజనం ఏముంటుంది? లోపాలు లేకుండా పరిశ్రమలు, అధికారులు పకడ్బందీగా వ్యవహరించాలి. అధికారులు తనిఖీలు చేపట్టాలి. ఇదొక్కటే పరిష్కారం. పేలుడు జరిగే అవకాశమున్న పరిశ్రమల్లో పేలుడు జరగకుండా అత్యంత పకడ్బందీగా నివారణ ఏర్పాట్లు చేసుకోవడం, సంబంధిత ప్రామాణిక నిర్వహణ ప్రక్రియను తూచా తప్పకుండా పాటించడమే ఏకైక మార్గం. పారిశ్రామిక వాడల్లో నిజాయతీగా తనిఖీలు చేపట్టే ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలి. ప్రామాణిక నిర్వహణ ప్రక్రియను సరిగా పాటించని పరిశ్రమలపై వాటిని మూసివేయడం సహా కఠిన చర్యలకు ఉపక్రమించాలి. ప్రమాదాల నివారణలో ఉద్యోగుల బాధ్యత కూడా ఉంది. ఉద్యోగానికి ఎంపికయ్యేటప్పుడే భద్రతా ప్రమాణాలను పాటిస్తున్నారో లేదో కచ్చితంగా తెలుసుకోవాలి. ఉద్యోగం వస్తోంది, జీవితంలో స్థిరపడుతున్నాం అని సరిపెట్టుకోకూడదు. భద్రతా ప్రమాణాలు పాటిస్తున్నారని రుజువుపర్చుకున్నాకే ఉద్యోగంలో చేరాలి. ఆ విషయాన్ని కచ్చితంగా యాజమాన్యానికి తెలియజేయాలి. ఉద్యోగంలో చేరిన తర్వాత కూడా భద్రతా ప్రమాణాల విషయంలో రాజీ పడకూడదు. ఎక్కడైనా యాజమాన్యం రాజీపడుతున్నట్లు గమనిస్తే ఒత్తిడి తీసుకురావాలి. తనపై ఆధారపడి ఒక కుటుంబం ఉందన్న సంగతి ప్రతిఒక్క ఉద్యోగీ గుర్తుంచుకోవాలి. కార్మిక సంఘాలు, ఉద్యోగ సంఘాలు కూడా కేవలం జీతభత్యాల పెంపుపై మాత్రమే పని చేయడానికి పరిమితం కాకుండా సురక్షిత పనివాతావరణంపై, ప్రామాణిక నిర్వహణ ప్రక్రియలపై అవగాహన పెంచుకుని వాటి కోసం ఒత్తిడి తెస్తూ ఉండాలి.



తుమ్మల బాల గంగాధర్ తిలక్

# రొట్టెల పండుగకు సిద్ధమైన.. బారాషహీద్ దర్గా

## • 80 మందితో ఫెస్టివల్ కమిటీ • ఛైర్మెన్‌గా.. ఖాదర్ బాషా



ప్రపంచ ప్రఖ్యాతిగాంచి, మతసామరస్యతకు ప్రతీకగా నిలిచిన నెల్లూరులోని బారాషహీద్ దర్గా ఈనెల 6వ తేదీ నుంచి అయిదురోజుల పాటు అంగరంగ వైభవంగా జరిగే గంధమహోత్సవం, రొట్టెల పండుగ వేడుకలకు సమాయత్తమైంది. ఆమేరకు నేతలు, జిల్లా ఉన్నతాధికారులు దర్గాలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. దర్గా నిర్వాహకులు దర్గాను, దర్గా ప్రాంగణాన్నంతా విద్యుద్దీపాలంకరణలతో శోభాయమానం చేశారు. భక్తుల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా జిల్లా పోలీసు యంత్రాంగం భారీ బందోబస్తు ఏర్పాటు చేసింది. రొట్టెల పండుగకు దేశ విదేశాల నుంచి కూడా లక్షలాదిమంది భక్తులు తరలి వస్తారు కనుక, వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా దర్గాను సందర్శించేందుకు ఏర్పాట్లు చేశారు. కోర్కెల రొట్టెలను స్వీకరించేందుకు వచ్చే భక్తులకు ఎక్కడా అసౌకర్యం కలుగకుండా, చెంతనే ఉన్న స్వర్ణాల చెరువులో బారికేడ్లు ఏర్పాటు చేసి భక్తుల రాకపోకలను క్రమబద్ధం చేసేందుకు అధికార యంత్రాంగం పెద్దఎత్తున చర్యలు చేపట్టింది. వాహనాల పార్కింగ్‌కు నగరంలోని పలు ప్రాంతాలను ఎంపికచేశారు.

### ఫెస్టివల్ కమిటీ ప్రమాణస్వీకారం :

బారాషహీద్ దర్గా ఫెస్టివల్ కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం ఈనెల 1న వైభవంగా జరిగింది. ఛైర్మెన్ ఖాదర్ బాషాతో పాటు 80మంది సభ్యులతో మంత్రి నారాయణ, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, రాష్ట్ర వక్ఫ్‌బోర్డు ఛైర్మెన్ అబ్దుల్‌అజీజ్, నుడా ఛైర్మెన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, డిప్యూటి మేయర్ రూప్‌కుమార్‌యాదవ్ తదితరులు పాల్గొని ఫెస్టివల్ కమిటీ వారితో ప్రమాణస్వీకారం చేయించి,శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ, బారాషహీద్ దర్గా రొట్టెలపండుగకు వచ్చే లక్షలాది మంది భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. దర్గా ఫెస్టివల్ కమిటీ సభ్యులందరూ ఏ చిన్న పొరపాటు జరగకుండా రొట్టెల పండుగను విజయవంతం చేసి, అందరికి మంచిపేరు తీసుకురావాలన్నారు.



### భక్తులకు ఉత్తమ సేవలందించాలి - ఎంపీ వేమిరెడ్డి

నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ, బారాషాహీదుల ఆశీస్సులు ఉంటేనే దర్గా కమిటీలో చోటు దక్కుతుందని, ఫెస్టివల్ కమిటి ఛైర్మెన్, సభ్యులందరూ అంకితభావంతో, చిత్తశుద్ధితో పనిచేయాలని చెప్పారు. కమిటీ సభ్యులు బాధ్యతగా పనిచేయాలని, దర్గాకు వచ్చే లక్షలాదిమంది భక్తులకు మౌలిక సదుపాయాల కల్పనలో ఎలాంటి లోటులేకుండా ఉత్తమ సేవలు అందించాలని సూచించారు. తొలుత, నేతలంతా బారాషహీదుల దర్గాను దర్శించుకుని భక్తిశ్రద్ధలతో ప్రార్ధనలు చేశారు.

### అధికారులతో కలెక్టర్ సమీక్ష :

రొట్టెల పండుగ ఏర్పాట్ల విషయమై ఈనెల 1న జిల్లా కలెక్టర్ ఆనంద్, సంబంధిత అధికారులతో సమీక్ష జరిపారు. పారిశుధ్యానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జులై 6 నుండి ఐదు రోజులపాటు జరిగే రొట్టెల పండుగకు గతంలో కంటే ఎక్కువగా భక్తులు వస్తారని అంచనా వేస్తున్నామని, అందుకనుగుణంగా అన్ని చర్యలు చేపట్టాలన్నారు. ముఖ్యంగా పారిశుద్ధ్య కార్యక్రమాలు అమల్లో ప్రత్యేక శ్రద్ధ వహించి అదనపు సిబ్బందిని నియమించాలన్నారు. స్వర్ణాల చెరువులో చాలినంతగా నీటిని ఉంచాల్సిందిగా ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. అదేవిధంగా పార్కింగ్ స్థలాల వద్ద, ఇతర అవసరమైన చోట మొబైల్ టాయిలెట్లు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. అగ్నిమాపక శాఖ వారు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. క్రౌడ్ మేనేజ్మెంట్‌కు అనుగుణంగా సరిపోయే పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయవలసిందిగా పోలీసు అధికారులకు సూచించారు. మెడికల్ టీములను, అంబులెన్స్‌లను సిద్ధంగా ఉంచుకోవాలని, భక్తుల భద్రత కోసం మరిన్ని సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. రొట్టెల పండుగ ఏర్పాట్లలో భాగమయ్యే వివిధ శాఖల సిబ్బందికి ఆయా రోజుల్లో ఎటువంటి సెలవులు ఇచ్చేది ఉండదని తెలిపారు. అధికారులందరూ రొట్టెల పండుగను ఘనంగా నిర్వహించేందుకు సమన్వయంతో పనిచేయాలన్నారు.

ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ కార్తీక్, ఏఎస్పీ సౌజన్య, మున్సిపల్ కమిషనర్ నందన్, , ఆర్డీవో అనూష, విద్యుత్తు, ఇరిగేషన్ శాఖల ఎస్ఈలు విజయన్, దేశ్ నాయక్, డీఎంఅండ్‌హెచ్‌ఓ సుజాత తదితరులు పాల్గొన్నారు.

---

## తిరుపతి జిల్లా గూడూరు డివిజన్

# త్వరలో ఉచిత బస్సు, నిరుద్యోగ భృతి

**ఎమ్మెల్యే పాశిం సునీల్**



ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం అర్హులైన పేదలందరికీ ఇళ్ళ వద్దకే పింఛన్లు అందజేస్తున్న ఘనత సీఎం చంద్రబాబుకే దక్కుతుందని ఎమ్మెల్యే డాక్టర్ పాశిం సునీల్‌కుమార్ తెలిపారు. గూడూరు పట్టణంలోని నలజాలమ్మవీధి ప్రాంతంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లు ఈ నెల 1వ తేదీన అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని, త్వరలోనే మహిళలకు ఉచిత బస్సు, యువతకు నిరుద్యోగభృతి కార్యక్రమాలను అమలు చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనల్ వెంకటేశ్వర్లు, నాయకులు బిల్లు చెంచురామయ్య, పులిమి శ్రీనివాసులు, కల్పన, శ్రీధర్, రవీంద్రరెడ్డి, రహీం, నరసింహులు పాల్గొన్నారు.



చార్టర్డ్ అకౌంటెంట్స్ డే సందర్భంగా ఈ నెల 1వ తేదీన ప్రముఖ సీనియర్ ఆడిటర్, ఎస్.వి.రత్నం చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మెన్ శ్రీకంటి రామమోహన్‌రావును ఆయన కార్యాలయంలో సన్మానిస్తున్న రోటరీక్లబ్ - వెస్ట్ సభ్యులు, ఐడిఎఫ్‌సి, ఏక్సిస్ బ్యాంకు సిబ్బంది, వాసవి క్లబ్ సభ్యులు.

## డిఆర్‌డబ్ల్యూ కళాశాల విద్యార్థినులకు

# రోటరీ క్లబ్ పుస్తకాల పంపిణీ



గూడూరు రోటరీ క్లబ్ సౌజన్యంతో ఇటీవల స్థానిక డిఆర్ డబ్ల్యూ కళాశాల విద్యార్థినులకు 500 నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీనియర్ రొటేరియన్ దశరథరామిరెడ్డి మాట్లాడుతూ ఈ పుస్తకాల వితరణ ద్వారా రోటరీ సేవలు విద్యార్థినీ విద్యార్థులలో ప్రాచుర్యం పొందుతాయన్నారు. పీడీజీ ముని గిరీష్ మాట్లాడుతూ విద్యార్థినులు తమ గ్రామాలలో ఉన్న సమస్యలను రోటరీ క్లబ్ దృష్టికి తీసుకొస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ మెహర్మణి మాట్లాడుతూ డిఆర్‌డబ్ల్యూ కళాశాల స్థాపనలో రొటేరియన్ల సహకారం మరువలేనిదన్నారు. 2025-26 రోటరీ ప్రెసిడెంట్‌గా బాధ్యతలను స్వీకరిస్తున్న వెంకటేశ్వరరెడ్డి కళాశాలకు 1000 నోట్‌బుక్స్ అందిస్తామన్నారని తెలియజేశారు. క్లబ్ ప్రెసిడెంట్ శ్రీధర్‌రెడ్డి, మల్లు విజయకుమార్‌రెడ్డి, ప్రిన్సిపల్స్, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

# బీసీ ఆత్మగౌరవ సభను జయప్రదం చేయండి

ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం, అంబేద్కర్ పూలే-ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 6వ తేదీన తిరుపతిలోని ఇందిరా మైదానంలో నిర్వహించనున్న బీసీ ఆత్మగౌరవ భరోసా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని మాజీ మంత్రి, అంబేద్కర్-పూలే ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు పరసా రత్నం కోరారు. ఇటీవల పట్టణంలోని హెడ్‌పోస్ట్‌ఆఫీస్ ప్రాంతంలోని పూలే విగ్రహం వద్ద బీసీ సంక్షేమ సంఘం గూడూరు నియోజకవర్గ అధ్యక్షులు తళ్ళం ప్రసాద్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించి ఆ వివరాలను తెలియజేశారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ అల్మెన్ రాజు, తిరుపతి జిల్లా అధ్యక్షులు నాగరాజుగౌడ్, ప్రధాన కార్యదర్శి పాలూరు నాగార్జునరావు, జానపద కళాకారుల సంక్షేమ సంఘం అధ్యక్షులు యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



# రోటరీ ఫౌండేషన్ కో-ఆర్డినేటర్‌గా బొమ్మిరెడ్డి

గూడూరు రోటరీ క్లబ్ అధ్యక్షునిగా 2024-25 ఏడాది కాలం విజయవంతంగా పూర్తిచేసుకున్న సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, కార్యదర్శి జి.జి.నాయుడులకు ఇటీవల బొమ్మిరెడ్డి రోటరీ కన్వెన్షన్‌లో కృతజ్ఞతాభివందన సభ నిర్వహించారు. క్లబ్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ ఈ సంవత్సర కాలంలో తాను చేపట్టిన సేవాకార్యక్రమాలు తనకు సంతృప్తిని కలిగించాయని, సేవా కార్యక్రమాలకు చేయూతనిచ్చిన దాతలకు, క్లబ్ సభ్యులకు, సీనియర్ రొటేరియన్స్‌కు ఆయన తన కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా సాయిరామ్ చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో డాక్టర్ రాజేంద్రకుమార్, డాక్టర్ రమణయ్య, డాక్టర్ పటేల్ - స్వరాజ్యం దంపతుల దాతృత్వంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ, సరస్వతి శిశు మందిరం పాఠశాల, కడివేడు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. అనంతరం రోటరీ జోన్-7 2025-28 సంవత్సరాలకు రీజనల్ రోటరీ ఫౌండేషన్ కో-ఆర్డినేటర్‌గా ఎన్నికైన బొమ్మిరెడ్డి సురేంద్రను క్లబ్ సభ్యులు ఘనంగా సన్మానించారు. అసిస్టెంట్ గవర్నర్ వాసు గౌడ్, పిడిజీ మునిగిరీష్, మేజర్ డోనార్ డాక్టర్ జనార్ధన్‌రెడ్డి, పాస్ట్ అసిస్టెంట్ గవర్నర్ దశరథరామిరెడ్డి పాల్గొన్నారు.



డాక్టర్ డే సందర్భంగా ఈ నెల 1వ తేదీ డాక్టర్ సి.ఆర్.రెడ్డి ఆసుపత్రిలో డాక్టర్ సి.రోహిణిని సన్మానిస్తున్న రోటరీ క్లబ్, ప్రగతి సేవా సంస్థ సభ్యులు

# సుపరిపాలనే ధ్యేయంగా..అడుగు ముందుకు

## - మంత్రులు నారాయణ, నిమ్మల రామానాయుడు



ఆర్థిక పరిస్థితి చిన్నాభిన్నమైన పరిస్థితుల్లో సైతం అభివృద్ధికి సంక్షేమాన్ని జోడించి సుపరిపాలనే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ముందడుగు వేస్తోందని మంత్రులు పొంగూరు నారాయణ, నిమ్మల రామానాయుడు సంతోషం వ్యక్తం చేశారు. ప్రజా సంక్షేమ పథకాల అమలులో అగ్రగామిగా ఉంటున్న ప్రభుత్వం తమదని అన్నారు. ఈనెల 2న జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, కావలి శాసనసభ్యులు దగుమాటి వెంకటకృష్ణారెడ్డిలతో కలిసి కావలి పట్టణంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలను మంత్రి నారాయణ ప్రారంభించారు. కావలి రూరల్ ప్రజల దశాబ్దాల కల అయిన కొత్త శివాలయం నుండి ఇందిరమ్మ కాలనీ వరకు గల రోడ్డును కోటి 20 లక్షల వ్యయంతో అభివృద్ధి చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసి సభలో మంత్రి నారాయణ మాట్లాడుతూ గత ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థను అస్తవ్యస్తం చేసిందని, ఖజానా ఖాళీ చేసి లక్షల రూపాయలు అప్పును మిగిల్చి వెళ్లిందన్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అపార అనుభవం ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నేతృత్వంలో గత సంవత్సర కాలంగా ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టడానికి కృషి జరుగుతోందన్నారు. అదేవిధంగా స్థానిక సంస్థల నిధులను ఆయా సంస్థల్లోనే వ్యయం చేసేందుకు వీలుగా నిబంధనలను సవరించామన్నారు.

### విధ్వంసం నుండి వికాసం వైపు - మంత్రి నిమ్మల

గత సంవత్సర కాలంగా విధ్వంసం నుండి వికాసం వైపు పయనించిన ప్రభుత్వ సుపరిపాలనను రాష్ట్ర ప్రజలందరూ గమనించాలని జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. గతానికి ప్రస్తుతానికి ఉన్నటువంటి స్పష్టమైన తేడాను గమనించి ప్రజలందరూ కూటమి ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని ప్రజలకు విజ్ఞప్తిచేశారు. కావలి మున్సిపల్ కమిషనర్ శ్రావణ్ కుమార్, పలువురు అధికారులు పాల్గొన్నారు.

# ఆర్ఎస్ఆర్ స్కూల్‌ను దత్తత తీసుకున్న వీపీఆర్



నెల్లూరులోని ఆర్ఎస్ఆర్ స్కూల్‌ను ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఇటీవల దత్తత తీసుకున్నారు. ఆ స్కూల్ అభివృద్ధికి ఆయన బాటలు వేయనున్నారు. ఈ నేపథ్యంలో ఈనెల 1న ఆయన మంత్రి నారాయణతో కలిసి ఆ స్కూల్‌ను సందర్శించారు. అక్కడ విద్యార్థులు చదువులో చూపిస్తున్న ఉత్సాహం చూసి మురిసిపోయారు. స్కూల్ అభివృద్ధికి ఏం చేస్తే బావుంటుందో ప్రణాళిక రూపొందించాలని వారు కార్పొరేషన్ అధికారులను ఆదేశించారు. అనంతరం వీఆర్‌సీ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా వేమిరెడ్డి మాట్లాడుతూ, తాను రిషివ్యాలీ స్కూల్‌లో చదువుకున్నానని, అంతకంటే గొప్పగా ఇక్కడ వీఆర్‌సీ పాఠశాల రూపుదిద్దుకోవడం సంతోషంగా ఉందన్నారు. లక్షల రూపాయల్లో ఫీజులు కడితే తప్ప కార్పొరేట్ స్కూళ్లలో చదువుకోలేమని, అయితే పేదపిల్లలు సైతం అంతకంటే ధీటుగా, డిజిటల్ విద్యను సైతం వీఆర్‌సీ పాఠశాలలో అందుకోనుండడం హర్షదాయకమని అన్నారు. ఆమేరకు వీఆర్‌సీని తీర్చిదిద్దిన మంత్రి నారాయణను ఆయన అభినందించారు. ఆర్థికంగా స్థిరపడిన వారు పాఠశాలల అభివృద్ధికి చేయూతనివ్వాలని, స్కూళ్ళను దత్తత తీసుకుని అభివృద్ధి చేయాలని వారు పిలుపునిచ్చారు.

# గురుప్రసాద్‌కి..సముచిత స్థానం!



## జిల్లా అభివృద్ధి సమన్వయ పర్యవేక్షణ కమిటీ సభ్యునిగా నియామకం

నెల్లూరులోని జయభారత్ ఆసుపత్రిలో జనరల్ మేనేజర్‌గా పనిచేస్తున్న సమాజ సేవాభిలాషి మారెళ్ళ గురుప్రసాద్ స్వచ్ఛంధ సంస్థల తరఫున జిల్లా అభివృద్ధి సమన్వయ పర్యవేక్షణ కమిటీ సభ్యులుగా ఎంపికయ్యారు. ఆ కమిటీకి నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఛైర్మన్‌గా వ్యవహరిస్తున్న విషయం తెలిసిందే. జడ్పీ సమావేశ మందిరంలో జులైన 1న జరిగిన దిశ కమిటీ సమావేశంలో ఆమేరకు ఆయన ఎంపిక జరిగింది. నెల్లూరులోని సింహపురి వైద్యసేవాసమితి ట్రస్టు నుంచి గురుప్రసాద్‌ను ఈ కమిటీకి సభ్యునిగా నియమించారు. ఆ ట్రస్టు ఎంతోకాలంగా చేస్తున్న సేవా కార్యక్రమాలు, ప్రత్యేకించి పేదలకు, గిరిజనులకు చేస్తున్న విశిష్ట వైద్యసేవల నేపథ్యంలో, ట్రస్టు తరఫున గురుప్రసాద్ నియామకం జరిగినట్లు సమాచారం. ఈ సందర్భంగా గురుప్రసాద్ మాట్లాడుతూ, ప్రజలకు సేవ చేసేందుకు ఇదొక మంచి అవకాశమన్నారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సలహామేరకు, కేంద్రప్రభుత్వం ద్వారా అమలవుతున్న పలు పథకాలను అధికారుల సహకారంతో పేదప్రజలకు తెలియజెప్పడం, పథకాలు అందుతున్నాయో లేదో పర్యవేక్షించడం తమ కర్తవ్యంగా ఉంటుందన్నారు. గురుప్రసాద్ నియామకం పట్ల వైద్యవర్గాల వారు, స్వచ్ఛంధ సంస్థల వారు హర్షం వ్యక్తం చేస్తూ, ఆయనకు శుభాభినందనలు తెలిపారు.

## గూడూరు బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య ఆధ్వర్యంలో..

# సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు



గూడూరు రెండవ పట్టణంలోని ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవాసంఘ సమాఖ్య, గూడూరు శాఖ వారి ఆధ్వర్యంలో శ్రీమతి ముంగమూరు సీతమ్మ బ్రాహ్మణ భవనంలో జులై 6, ఆదివారం ఉదయం 9 గంటలకు సమాఖ్య అధ్యక్షులు ఆనిమెళ్ళ శివకుమార్ దంపతులు, నెల్లూరు వాస్తవ్యులు పండితోపన్యాసకులు, విశ్రాంత తెలుగు పండితులు బ్రహ్మశ్రీ ఆలూరు శిరోమణిశర్మ దంపతుల ఆధ్వర్యంలో శ్రీ సత్యనారాయణస్వామి సామూహిక వ్రతాలను నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈమేరకు ఇటీవల సమాఖ్య సభ్యులు సమావేశమై బ్రాహ్మణ బంధువులు సత్యనారాయణస్వామి వ్రతంలో పాల్గొని, స్వామివారి ఆశీస్సులు అందుకొని తీర్థప్రసాదాలు స్వీకరించి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సమాఖ్య అధ్యక్షులు ఆనిమెళ్ళ శివకుమార్, కార్యదర్శి చిట్టమూరు శ్రీనివాసరావు, కోశాధికారి వి.లలితమ్మ, కడివేటి రామమూర్తి, పురుషోత్తమరావు, డి.బి.శ్రీనివాసరావు, వి.ఎల్.నరసింహం, ప్రకాశం తదితర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



## పెద్దాసుపత్రి సూపరింటెండెంట్‌గా..

# డాక్టర్ మాధవి

నెల్లూరు నగరంలోని ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ మాధవి నియమితులయ్యారు. ఏసీ సుబ్బారెడ్డి ప్రభుత్వ వైద్యకళాశాల వైస్ ప్రిన్సిపల్‌గా పనిచేస్తున్న డాక్టర్ మాధవిని పెద్దాసుపత్రి సూపరింటెండెంట్‌గా నియమిస్తూ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీచేయడంతో ఆమె ఈనెల 2న ఆ మేరకు బాధ్యతలు చేపట్టారు. ఇదే స్థానంలో సూపరింటెండెంట్‌గా వున్న సిద్దానాయక్ జూన్ 30న ఉద్యోగ విరమణ చేశారు. ఆయన నుంచి డాక్టర్ మాధవి బాధ్యతలు స్వీకరించారు. ఆసుపత్రి అభివృద్ధి కమిటీ కన్వీనర్ శ్రీనివాసులు, డాక్టర్ మస్తాన్‌బాషా, ఏ.డి ఏడుకొండలు, ఆసుపత్రి ఉద్యోగులు, వైద్యులు, సిబ్బంది డాక్టర్ మాధవిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

# గుండెపోటు మందులు పంపిణీ చేసిన.. ఫ్రెండ్స్ వాకర్స్



నెల్లూరులోని ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ వారు ఇటీవల స్థానిక ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో జరిగిన కార్యక్రమంలో, గుండెపోటుకు సంబంధించి ప్రాథమిక చికిత్సకు అవసరమయ్యే మందులను ఉచితంగా పంపిణీ చేశారు. సుమారు 500 ప్యాకెట్ల మందులు ఇచ్చి, వాటి ఉపయోగాన్ని తెలియజేశారు. గుండెపోటు వచ్చినట్లు అనుమానం రాగానే ఆ మందులు వేసుకుంటే అవి ప్రాథమిక చికిత్సకు ఎంతగానో ఉపకరిస్తాయని వివరించారు. నెల్లూరులోని శుభమస్తు షాపింగ్‌మాల్ అధినేతలు బయ్యా వాసు, బయ్యా రవి సహకారంతో, ప్రముఖ గుండెజబ్బుల వ్యాధి నివారణ నిపుణులు డాక్టర్ సీఎస్ శ్రీనివాసరాజు సూచనలతో ఆ మేరకు మందులు పంపిణీ చేయడం జరిగిందని ఫ్రెండ్స్ వాకర్స్ నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ అసోసియేషన్ ప్రెసిడెంట్ కిలారి శ్రీనివాసులునాయుడు, సెక్రటరీ గువ్వల నారాయణరెడ్డి, కోశాధికారి మాగంటి ప్రసాద్, మాజీ ప్రెసిడెంట్, 203 డిస్ట్రిక్ట్ ఎలెక్ట్ గవర్నర్ నలుబోలు బలరామయ్యనాయుడు, వాకర్స్ ప్రతినిధులు బెల్లం చెంచయ్య, ఎస్‌కె నజీర్ అహ్మద్, బిరదవోలు రామమోహన్‌రెడ్డి, కె.వెంకటరమణ, బి.భాస్కర్‌నాయుడు, రత్నయ్య, గోవర్ధన్, మహేంద్ర, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## ○ వివేకానంద వాకర్స్ వితరణ

# స్టేడియం సిబ్బందికి..నిత్యావసరాలు



నెల్లూరులోని వివేకానంద వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అసోసియేషన్ సభ్యుడు పాతపాటి విజయమోహన్‌రెడ్డి పుట్టినరోజుసందర్భంగా స్థానిక ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో పనిచేస్తున్న 15 మంది ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి సుమారు 40 వేల రూపాయల విలువచేసే నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. అసోసియేషన్ అధ్యక్షులు చింతల అమరేంద్రరెడ్డి, కార్యదర్శి పొన్నం రవిచంద్ర, కోశాధికారి జీకే గోపినాథ్, వాకర్స్ మాజీ గవర్నర్ రాఘవేంద్రషెట్టి, వాకర్స్ ప్రతినిధి నలుబోలు బలరామయ్యనాయుడు, సభ్యులు డీవీ సుబ్బరాజు, స్వర్ణ రమేష్ బాబు, ఖలీల్ బేగ్, గఫార్, విజయ మోహన్‌నాయుడు, గోపాల్ రెడ్డి, సుబ్బరామిరెడ్డి, ఓబులు రెడ్డి, స్నేహ సురేష్, కిలారి శ్రీనివాసులు నాయుడు, రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రోడ్లు భవనాలశాఖలో

# బదిలీలు

జిల్లాలోని రోడ్లు భవనాల శాఖలో తాజాగా ఈనెల 2న బదిలీలు జరిగాయి. నెల్లూరులో ఆ శాఖలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న వై. మురళీకృష్ణను అనంతపురానికి బదిలీ చేశారు. అక్కడ ఆయనకు ఇన్‌ఛార్జి ఎస్ఇ హోదాను కల్పించారు. అదేవిధంగా, నెల్లూరు ఎస్ఇ కార్యాలయంలో పనిచేస్తున్న ఇఇ స్లాన్లే జాన్స్‌ను విజయవాడకు బదిలీ చేసి, అక్కడ జాన్స్‌కు ఇన్‌చార్జి ఎస్ఇ హోదా ఇస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

## మంత్రి లోకేష్ చేతులమీదుగా...

# ఈనెల 7న.. విఆర్ పాఠశాల ప్రారంభం!

నెల్లూరులోని విఆర్ పాఠశాలను రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఈనెల 7న ప్రారంభించబోతున్నారని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి (విపిఆర్) తెలిపారు. జులై 1న ఆయన మంత్రి నారాయణతో కలిసి నగరంలోని విఆర్ పాఠశాలలోని ప్రతి తరగతి గదిని పరిశీలించారు. ఈ సందర్భంగా విపిఆర్ మాట్లాడుతూ, విద్యావ్యవస్థలో లోకేష్ విప్లవాత్మక మార్పులు తెస్తున్నారన్నారు. విఆర్ పాఠశాలను రాష్ట్ర పురపాలక శాఖమంత్రి పొంగూరు నారాయణ అద్భుతంగా తీర్చిదిద్దారని చెప్పారు. అంతర్జాతీయ ప్రమాణాలతో ప్రారంభానికి సిద్ధమైన వీఆర్‌సీలో వసతులు చాలా బాగున్నాయన్నారు. తాను రిషీవ్యాలీ పాఠశాలలో చదివానని, అంతకంటే గొప్పగా వీఆర్ పాఠశాలను మంత్రి నారాయణ తీర్చిదిద్దారని అన్నారు. మూతపడ్డ విఆర్‌సిని మళ్ళీ ఆధునీకరించి ప్రారంభింపజేయడం చిన్న విషయమేమీకాదన్నారు. వీఆర్సీలో 1050 సీట్లుంటే 5 వేల అప్లికేషన్లు వచ్చాయని, అయితే ఇక్కడ తమ పిల్లలు చదివే అవకాశం రాలేదని ఎవరూ బాధపడొద్దని, వచ్చే ఏడాది తప్పకుండా అవకాశం వస్తుందన్నారు. ఇతర ప్రాంతాల్లో ఆర్థికంగా స్థిరపడిన నెల్లూరువాసులు ప్రభుత్వ పాఠశాలల దత్తతకు ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. జిల్లాలో వీఆర్ పాఠశాల తరహాలో మరికొన్నింటిని తీర్చిదిద్దాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా



తాను దత్తత తీసుకుంటున్న ఆర్ఎస్ఆర్ పాఠశాలను మంత్రి నారాయణతో కలిసి సందర్శించారు. స్టోన్‌హౌస్‌పేటలో ఉన్న ఆర్ఎస్ఆర్ పాఠశాలలో ఏర్పాటు చేయాల్సిన వసతులపై ఆరాతీశారు. త్వరలోనే అన్ని వసతులు కల్పించేందుకు ప్రణాళిక రూపొందించేలా చర్యలు తీసుకుంటా మన్నారు. అనంతరం పాఠశాల పరిసర ప్రాంతాల్లో కలియదిరిగారు. కార్పొరేషన్ కమిషనర్ నందన్, పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

# మైపాడు రోడ్డు పనులకు గ్రీన్ సిగ్నల్

**- కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి -**

గత ప్రభుత్వ తప్పిదాల కారణంగా నెల్లూరు-మైపాడు రోడ్డ పనులు ఆగిపో యాయని, ఆ సమస్యను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్లి మైపాడురోడ్డు పనులకు గ్రీన్ సిగ్నల్ పొందామని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి చెప్పారు. నెల్లూరు నుంచి సముద్ర తీరప్రాంతానికి వెళ్లే మైపాడు రోడ్డు పనులను త్వరలోనే ప్రారంభింప జేస్తామని... అదేవిధంగా, దశాబ్దాల నాటి కలగా మిగిలిన ముదివర్తి - ముదివర్తి పాళెం కాజ్‌వే నిర్మాణాన్ని కూడా త్వర లోనే పూర్తి చేయిస్తామని ఆమె తెలిపారు. జులై 1న ఇందుకూరుపేట మండలం ముదివర్తిపాళెం గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణి కార్యక్ర మంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఇంటింటికెళ్లి ఆప్యాయంగా అందరినీ పలకరిస్తూ పింఛన్లు అందచేశారు. స్థానిక సమస్యలపై ప్రజల విన్నపాలు ఓపిగ్గా విన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరు




గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి చంద్ర బాబునాయుడు గత ఐదేళ్ల అస్తవ్యస్త పాలనను ప్రణాళికాబద్ధంగా తీర్చిదిద్దుతూ రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్నారని కొనియాడారు. ముదివర్తి పాళెం కాజ్‌వే నిర్మాణం పూర్తయ్యాక ఇందుకూరుపేట మండల వాసులకు వరద ముప్పుతో పాటు ఉప్పునీటి సమస్య వుండదన్నారు. రాముడుపాళెం కాలువపై స్థానికుల విన్నపాన్ని వింటూ, వరద ముప్పు రాకుండా కాలువకు రక్షణగోడ నిర్మిస్తామన్నారు. సూపర్ సిక్స్ హామీలలో భాగంగా మహిళలకు ఉచితంగా ఏడాదికి 3 సిలెండర్లు, తల్లికి వందనం పథకాలను దిగ్విజయంగా అమలు చేశామన్నారు. త్వరలోనే ఆటోడ్రైవర్లను ఆర్థికంగా ఆదు కునే కార్యక్రమంతో పాటు రైతులకు అన్నదాత సుఖీభవ పథకాలను అమలు చేయనున్నామన్నారు.

ఒక తరగతికి ఒక ఉపాధ్యాయుడు అనే ధ్యేయంతో విద్యాశాఖా మంత్రి లోకేష్ విద్యారంగంలో వినూత్న మార్పులు తెచ్చారన్నారు. సచివాలయ సిబ్బంది చొరవ తీసుకొని బడిఈడు పిల్లలను పాఠశాలలో చేర్పించాలని కోరారు. గత ప్రభుత్వం గృహనిర్మాణ రంగాన్ని అస్త వ్యస్తంగా మార్చి.. పేదల సొంతింటి ఆశలను అడియాసలు చేసిందన్నారు. అర్హులను గుర్తించి త్వరలోనే పేదలకు ఇళ్ల నిర్మాణాలు చేపడతామని, ప్రతి ఒక్కరికి కూడు, గుడ్డ, నీడ కల్పించడమే టీడీపీ లక్ష్యమన్నారు.

# ఆంధ్ర నీటిహక్కులను అడ్డుకోవాలనుకోవడం అన్యాయం

ఆంధ్ర ప్రాంతంలో సముద్రం పాలయ్యే గోదావరి జలాలపై అభ్యంతరం తెలిపే హక్కు తెలంగాణకు లేదని, తెలంగాణలో కాంగ్రెస్ బిఆర్ఎస్ రాజకీయ క్రీడలో ఆంధ్రాను బలిచేయొద్దని బిజెపి నమామిగంగే రాష్ట్ర కన్వీనర్ మిడతల రమేష్ అన్నారు. లోయర్ రిపేరియన్ రైట్స్ ప్రకారం దిగువ ప్రాంతాలలో ఉన్నవారికి నీటిపై సంపూర్ణహక్కులు ఉంటాయని ఆయన అభిప్రాయపడ్డారు. నెల్లూరులో ఆయన మాట్లాడుతూ, ఇంజనీరింగ్ అధికారులు లోయర్ రిపే రియన్ రైట్స్ హక్కులు మరిచినట్లున్నారని ఆయన అన్నారు. 3వేల టీఎంసీల గోదావరి జలాలు ప్రతి సంవత్సరం సముద్రంలో కలుస్తున్నాయని లెక్కలు చెబుతున్నాయని, అందులో 200 టీఎంసీలను ఆంధ్ర ప్రాంతంలోకి మళ్లించు కుంటామంటే తెలంగాణకే కాదు సీడబ్ల్యుసి (కేంద్ర జలసంఘం)కి కూడా అభ్యంతరం ఉండకపోవచ్చని ఆయన అన్నారు. విభజన చట్టం ప్రకారం గోదావరి నికరజలాలు పంపిణీపై స్పష్టత నివ్వాలని సిడబ్ల్యుసిని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కోరిందని, సముద్రంలో వృధాగా కలిసిపోయే మిగులు జలాలను వినియోగించుకోకూడదని ఏ ట్రిబ్యునల్ చెప్పలేదని ఆయన అన్నారు. గోదావరి వరద జలాలను సముద్రంలో కలవకుండా ఒక్కసారి ఎగువ ప్రాంతమైన తెలంగాణ ఆపి చూపిస్తే ప్రపంచంలో చట్టాలనే తిరగరాయవచ్చన్నారు. ట్రిబ్యునల్ తీర్పులు సుప్రీంకోర్టు తీర్పులు ఎన్ని ఉన్నప్పటికీ ఎగువ ప్రాంత రాష్ట్రాలు వర్షాలు తక్కువగా కురిసినప్పుడు దిగువ రాష్ట్రాలకు తీరని అన్యాయం చేయడం మనం గమనిస్తూనే ఉన్నామన్నారు. గత 25 సంవత్సరాలలో కృష్ణా జలాలలో నీటి లభ్యత తక్కువగా ఉన్నప్పుడు కర్నాటక సస్యశ్యామలంగా

**'నమామి గంగే' రాష్ట్ర కన్వీనర్ మిడతల రమేష్**



పంటలు పండించుకుందని, శ్రీశైలం నాగార్జునసాగర్ డ్యాములు నాలుగు పర్యాయాలు నీటి సంక్షోభాన్ని ఎదుర్కొన్నాయని గుర్తుచేశారు. ప్రజల తాగునీటి అవసరాల కోసం కూడా ఆంధ్ర రాష్ట్రానికి హక్కులు ఉన్నప్పటికీ ఆంధ్రకు పైభాగంలో ఉన్న కర్నాటక తెలంగాణ నీటిని బిగదీశాయన్నారు. ఆంధ్ర వాళ్ళు పోలవరం నుండి బనకచర్లకు దోచుకుపోతారని లేనిపోని దుష్ప్రచారాలు చేయడం మంచిపద్ధతి కాదన్నారు. రెండు నదుల బేసిన్లు ఒకటిగా కలిసి నీటి తరలింపు జరిగితేనే ఇతర రాష్ట్రాలకు ఆ నీటిలో వాటా అడిగే హక్కు ఉందని ట్రిబ్యునల్ తీర్పులు చెబుతున్నాయని, పోలవరం నుండి గోదావరి జలాలు బనకచర్ల ద్వారా కృష్ణనీటిలో ప్రాజెక్టు పూర్తయిన తర్వాత ప్రవహించే నీళ్లలో మాత్రమే తెలంగాణ నీటి వాటాల గురించి అడగాల్సి ఉందని ఆయన తన అభిప్రాయాన్ని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట పలువురు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

## టూకీగా...

### రెడ్డిపాళెంలో విద్యార్థులకు విద్యాసామగ్రి

బుచ్చిరెడ్డిపాళెం మండలం రెడ్డిపాళెం ప్రభుత్వ గిరిజన పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు, స్థానిక సహారా ఎడ్యుకేషనల్ రూరల్ డెవలప్‌మెంట్ వారి ఆధ్వర్యంలో జూన్ 30న నోటుపుస్తకాలు వగైరా విద్యా సామగ్రిని పంపిణీ చేశారు. ఎంఇఒ-2 పి.రత్నం, సొసైటీ అధ్యక్షులు యస్దాని బాషా, ప్రధానోపాధ్యాయురాలు గిరిజాకుమారి తదితరులు పాల్గొన్నారు.

### సైదాపురంలో ఉరేసుకుని వ్యక్తి మృతి

సైదాపురం దళితవాడలో కె.వెంకటరమణయ్య అనే వ్యక్తి కుటుంబ కలహాల నేపథ్యంలో జూన 30న ఫ్యాన్‌కి ఉరేసుకుని మృతిచెందాడు. పోలీసులు పరిశీలించి, మృతదేహాన్ని పోస్టు మార్టం కోసం గూడూరుకు తరలించారు. మృతుని తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ క్రాంతికుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### బెడుసుపల్లిలో అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

సీతారామపురం మండలంలోని బెడుసుపల్లి గ్రామంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని జూన్ 30న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షేక్ షానూ తనిఖీ చేసి, రిజిస్టర్లు పరిశీలించారు. చిన్నారులకు సక్రమంగా పోషకాహారం పెట్టాలని, ఆటపాటలతో ఆ పిల్లలకు విద్యను బోధించాలని చెప్పారు. అంగన్‌వాడీ కార్యకర్తలు నారా యణమ్మ, ఫణిరాజకుమారి, ఎలీసమ్మ తదితరులు పాల్గొన్నారు.

### కలిగిరమ్మ దేవాలయంలో అన్నదానం

మండల కేంద్రమైన కలిగిరిలో గ్రామదేవత కలిగిరమ్మ దేవస్థానంలో జరుగుతున్న ఉత్సవాల్లో భాగంగా జూన్ 30న స్థానిక కొత్తూరు కోదండరామస్వామి వారి ఆలయం తరపున వేలాదిమంది భక్తులకు అన్నదానం గావించారు. ఉత్సవాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆ ఆలయం నిర్వాహకులు అన్ని మౌలిక సదుపాయాలను కలిగించారు.

### కృష్ణపట్నంలో డ్రైనేజీ కాలువల పనులు

ముత్తుకూరు మండలం కృష్ణపట్నం గ్రామ పంచాయతీలో జూన్ 30న శంభన్‌వీధి-లైట్‌హౌస్‌రోడ్డులో డ్రైనేజీ కాలువల నిర్మాణపు పనులను మొదలుపెట్టారు. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి సహకారంతో పంచాయతీ సాధారణ నిధులతో ఈ పనులు చేపట్టినట్లు టీడీపీ నాయకుడు యేకొల్లు కోదండరామయ్య తెలిపారు.

### బ్రహ్మదేవిలో గిరిజనులకు దుప్పట్లు పంపిణీ

ముత్తుకూరు మండలం బ్రహ్మదేవి వద్ద నున్న తునకల సంఘం గిరిజన కాలనీలోని కుటుంబాలకు టీడీపీ సీనియర్ నాయకుడు బొబ్బేపల్లి అంకయ్య జులై 1న దుప్పట్లు పంపిణీ చేశారు. తన పుట్టినరోజు సందర్భంగా ఆయన ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. టీడీపీ నాయకులు పసుపులేటి లక్ష్మీప్రసాద్, తంబి రామయ్య, షేక్ మౌలాలి, రవీంద్ర పాల్గొన్నారు.

### సోమశిలను సందర్శించిన మత్స్యశాఖ అధికారులు

అనంతసాగరం మండలంలోని సోమశిల జలాశయం పరిసర ప్రాంతాలను మత్స్యశాఖ అధికారులు జులై 1న సందర్శించారు. జలాశయంలో చేపల వేటపై నిషేధాజ్ఞలు అమలులో ఉండడంతో, పరిస్థితులను ఆరా తీశారు. జలా శయంలో ఎవరైనా అక్రమంగా చేపల వేట సాగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

### శకునాలపల్లిలో రైతులకు అవగాహన

ఉదయగిరి మండలంలోని శకునాలపల్లిలో జులై 1న వ్యవసాయ అధికారులు పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించి రసాయనిక ఎరువుల వినియోగం పట్ల రైతులకు అవగాహన కలిగించారు. భూసారపరీక్షల ఫలితాల మేరకే, రసాయనిక ఎరువులు వాడాలన్నారు. ఏఇఓలు రాజశేఖర్‌రెడ్డి, వినోద్, గ్రామ వ్యవసాయ సహాయకురాలు పూజిత పాల్గొన్నారు.

### బుచ్చిలో యుటిఎఫ్ సభ్యత్వ నమోదు

బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని ప్రాథమిక, ఉన్నత పాఠశా లల్లో ఉపాధ్యాయులను ఐక్య ఉపాధ్యాయ సంఘం (యుటిఎఫ్) లోకి తీసుకునేందుకు సభ్యత్వ నమోదును జులై1న ప్రారంభిం చారు. మండల యుటిఎఫ్ శాఖ అధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సుధాకర్ ఆధ్వర్యంలో ఈ నమోదు జరిగింది.



# మురుగు కాలువల బాగుకు శ్రీకారం

## • స్వయంగా పర్యవేక్షించిన మంత్రి నారాయణ

నెల్లూరునగరంలో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని, మురుగును శుభ్రం చేయించేందుకు రాష్ట్ర పురపాలక మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ సంకల్పించారు. నెల్లూరులోని 45వ డివిజన్ పొగతోటలో జరుగుతున్న కాలువ పూడికతీత పనులను ఆయన ఇటీవల పరిశీలించారు. నాణ్యత ప్రమాణాలతో పారిశుద్ధ్య పనులను చేపట్టాలని సిబ్బందికి సూచించారు. మురికి ప్రదేశాల్లో, చెత్త పేరుకుపోయిన ప్రాంతాల్లో మంత్రి నారాయణ స్వయంగా నడిచి వెళ్లి పరిశీలించారు. పట్టణాలు, నగరాల్లో తాగునీరు, చెత్త తొలగింపు, పూడికతీత పనులు ముఖ్యమైనవని, వాటికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ఆయన చెప్పారు. ఆ పనులన్నీ త్వరలో పూర్తి చేయిస్తామన్నారు. నెల్లూరులో 40 కాలువల్లో పూడికతీత పనులకు శ్రీకారం చుట్టామని తెలిపారు. గత ప్రభుత్వం ఖజానా ఖాళీ చేసి వెళ్ళిందని, మున్సిపల్ శాఖకు చెందిన 3 వేల కోట్లను కూడా నాటి పాలకులు పక్కదారి పట్టించారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి పాలనా అనుభవంతో పరిస్థితులు గాడిలో పడుతున్నాయన్నారు.

# విష్ణు కార్స్‌కు.. మరో ప్రతిష్టాత్మక గుర్తింపు

## రెండు విభాగాల్లో పురస్కారాలందుకున్న దీపా వెంకట్

లక్షలాది కస్టమర్ల ఆదరణతో కార్ల వ్యాపారంలో నమ్మకానికి మారుపేరుగా నిలిచిన విష్ణు కార్స్ మరో ప్రతిష్టాత్మక పురస్కారాన్ని తన ఖాతాలో వేసుకుంది. చెన్నై జీఎస్‌టీ శాఖ ప్రకటించిన టాప్ టాక్స్ పేయర్, అత్యుత్తమ పారిశ్రామిక వేత్తల విభాగాల్లో రెండు పురస్కారాలకు ఏకకాలంలో ఎంపికైన సంస్థగా నిలిచింది. రెండు విభాగాల్లో ఉత్తమంగా ఒకే సంస్థ నిలవడం ఇదే తొలిసారి. టాప్ టాక్స్ పేయర్‌గా విష్ణుకార్స్, ఉత్తమ మహిళా పారిశ్రామికవేత్తగా విష్ణుగ్రూప్ ఆఫ్ కంపెనీస్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీమతి దీపా వెంకట్ ఎంపిక కావడం విశేషం. 8వ సి.జి.ఎస్.టి దినోత్సవాన్ని పురస్కరించుకుని జి.ఎస్.టి. తమిళనాడు మరియు పుదుచ్చేరి జోన్ చెన్నైలోని కలైవర్ ఆరంగంలో జులై1న ఏర్పాటు చేసిన కార్యక్రమంలో దీపా వెంకట్ ఆ రెండు పురస్కారాలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో సీయుఎంఐ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీధరన్ రంగరాజన్, ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ డా. రామ్‌నివాస్, ప్రిన్సిపల్ చీఫ్ కమిషనం ఏఆర్ఎస్ కుమార్ పాల్గొన్నారు.



### నమ్మకానికి మారుపేరు విష్ణు కార్స్

**దీపా వెంకట్**

ఈ సందర్భంగా దీపా వెంకట్ మాట్లాడుతూ, గత 15 సంవత్సరాలుగా నమ్మకానికి మారుపేరుగా నిలిచిన విష్ణు కార్స్‌ను రెండు విభాగాల్లో సీజీఎస్‌టీ వారు గుర్తించడం ఆనందంగా ఉందన్నారు. కస్టమర్ల ఆదరణ మరియు సంస్థలో సేవలు అందిస్తున్న ఉద్యోగుల నిబద్ధతతోనే ఇది సాధ్యమైందని అంటూ, ఈ పురస్కారాలను వారికి అంకితం చేస్తున్నట్లు తెలిపారు. వ్యాపార రంగంలో ఈ పురస్కారాలు తమ బాధ్యతను మరింత పెంచాయనని, ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో ముందుకు సాగుతామని చెప్పారు.

## శ్రీసిటీ-'ఐసాన్' వితరణతో..


# విద్యార్థులకు వసతులు



శ్రీసిటీ ఫౌండేషన్ చొరవతో, కార్పొరేట్ సామాజిక బాధ్యతలో (సీఎస్ఆర్) భాగంగా శ్రీసిటీలోని జపాన్ పరిశ్రమ ఐసాన్ ఆటో పార్ట్స్ ఇండియా వారు సుమారు 18.80 లక్షల రూపాయలతో నిర్మించిన వివిధ విద్యా వసతులను ఐసాన్ మేనేజింగ్ డైరెక్టర్ యసనోరి సకావే, శ్రీసిటీ డైరెక్టర్ (సీఎస్సార్) నిరీషా సన్నారెడ్డి ఇటీవల ప్రారంభించారు. సూళ్ళూరుపేట ప్రభుత్వ బాలికల హైస్కూల్‌లో 6.50 లక్షల ఖర్చుతో అదనపు మరుగుదొడ్లు, వంట గది నిర్మాణం, సత్యవేడు మండలం రామచంద్రపురం గ్రామంలో రూ. 12.30 లక్షల వ్యయంతో అంగన్‌వాడీ భవనం నిర్మించారు. ఈ సందర్భంగా ఐసాన్ మేనేజింగ్ డైరెక్టర్ యసనోరి సకాయి మాట్లాడుతూ, విద్యా వసతుల కోసం సీఎస్సార్ కార్యక్రమాలు చేపట్టడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు.

శ్రీసిటీ డైరెక్టర్ (సీఎస్సార్) నిరీషా సన్నారెడ్డి ఐసాన్ పరిశ్రమ సీఎస్సార్ చొరవను ప్రశంసిస్తూ, విద్య, ఆరోగ్య సంరక్షణ మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడంలో శ్రీసిటీ ఫౌండేషన్ నిబద్ధతతో ఉందన్నారు. విద్యార్థులు ఈ సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని చదువుల్లో బాగా రాణించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో ఐసాన్ పరిశ్రమ ప్లాంట్ హెడ్ యూచి టొమిట, హెచ్ఆర్ జనరల్ మేనేజర్ గోపాల్, ప్రొడక్షన్ కోఆర్డినేటర్ తోషిహిరో సనా, మ్యానుఫ్యాక్చరింగ్ డిజిఎం దేవనాథన్, శ్రీసిటీ ఫౌండేషన్ సీనియర్ మేనేజర్ సురేంద్రకుమార్ పాల్గొన్నారు.

దాదాపు 600 మందికి పైగా విద్యార్థులున్న సూళ్ళూరుపేట హైస్కూల్లో గతంలో 12 మరుగుదొడ్లు మాత్రమే ఉండేవి. అవి సరిపోక పిల్లలు ఇబ్బందులకు గురయ్యేవారు. అలాగే రామచంద్రాపురంలో గతంలో ఒకే భవనంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, అంగన్వాడీ తరగతులు నిర్వహించేవారు. విద్యార్థుల సంఖ్య పెరగడంతో స్థలాభావం ఏర్పడింది. ఎట్టకేలకు శ్రీసిటీ ఫౌండేషన్, ఐసాన్ పరిశ్రమల చొరవతో, నూతన వసతుల ఏర్పాటు కావడం వల్ల ఈ సమస్యలకు పరిష్కారం లభించింది. విద్యా వసతుల పట్ల స్కూల్ ఉపాధ్యాయ బృందం, విద్యార్థినులు ఆనందం వ్యక్తం చేస్తూ శ్రీసిటీకి, ఐసాన్ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు.




Edited, Published, Printed & Owned by THUNGA SIVAPRABHATH REDDY, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at Roopa Graphics, Magunta Layout, NELLORE-3. Cell: 9866314741. Editor-THUNGA SIVAPRABHATH REDDY, Managing Editor : T.BHARATHI REDDY, Sub-Editor : MADDURU SRINIVASULU. e-mail: lawyerpatrika@gmail.com